మీ ఆత్మీయులలో... స్నేహితులలో... సన్నిహితులలో... ఎవరికైనా... ఎలాంటి శుభ సందర్భమైనా
మీ హృదయపూర్వక శుభాకాంక్షలు... విజయభాను ద్వారా అందించండి!
విజయభాను
9-3-17, PITHAPURAM COLONY , VISAKHAPATNAM-530 003
❖ Phone : 2564353, Fax : 0891-2569004

విజయభాను

40 Years of Excellence
విజయభాను వార్షికోత్సవ శుభాకాంక్షలు

హైదరాబాద్, శనివారం 12-08-2017 | VIJAYABHANU DAILY HYDERABAD EDITION | సంపుటి : 36 సంచిక : 331 పేజీలు : 8 వెల : 1 రూపాయి

వెంకయ్యనాయుడు అను నేను..

భారత ఉపరాష్ట్రపతిగా ప్రమాణం చేసిన తెలుగుతేజం

దర్బార్‌హాలులో ప్రమాణం చేయించిన రాష్ట్రపతి కోవింద్

న్యూఢిల్లీ: దేశంలో రెండో అత్యున్నత రాజ్యాంగ పదవిలో తెలుగువారైన వెంకయ్యనాయుడు ఆశీనులయ్యారు. రాష్ట్రపతి భవన్‌లోని దర్బార్ హాలులో శుక్రవారం ఉదయం భారత ఉపరాష్ట్రపతిగా ఆయన ప్రమాణం చేశారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్.. వెంకయ్యతో ప్రమాణం చేయించారు.

వెంకయ్య నాయుడు అను నేను.. రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత ప్రదర్శిస్తానని ఉపరాష్ట్రపతిగా ప్రమాణం చేస్తున్నా అంటూ హిందీలో ప్రమాణం చేశారు. అనంతరం పుస్తకంలో సంతకం చేశారు. కొత్త ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును మొదటిగా రాష్ట్రపతి కోవింద్ అభినందించారు. అటుపై మొదటి వరుసలో కూర్చున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు.. ఉపరాష్ట్రపతికి నమస్కరించారు. 10 నిమిషాలపాటు సాగిన ఈ కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, విపక్షాలకు చెందిన కీలక నేతలు, రాష్ట్రాల సీఎంలు, పలు దేశాల రాయబారులు, ఇతర ముఖ్యనేతలు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి ముందు రాజ్‌ఘాట్‌కు వెళ్లిన వెంకయ్య.. జాతిపిత మహాత్మాగాంధీకి నివాళులు అర్పించారు. సర్దార్ వల్లభాయి పటేల్, దీన్‌దయాళ్ ఉపాధ్యాయలకు కూడా వెంకయ్య పుష్పాంజలి ఘటించారు.

మొట్టమొదటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడే

- స్వాతంత్ర్యానంతరం జన్మించినవారిలో ఆ పదవి చేపట్టిన తొలి వ్యక్తి
- రాజ్యసభలో గుర్తుచేసిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: భారత 13వ ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన ముప్పవరపు వెంకయ్య నాయుడు అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పుట్టినవాళ్లలో.. ఉపరాష్ట్రపతి చేపట్టిన మొట్టమొదటి వ్యక్తిగా నిలిచారు.

ఈ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యసభలో తరువాయి 2లో

ట్రాఫికర్

- పద్మవ్యూహంలో చిక్కుకున్న కేటీఆర్!
- సభాస్థలికి చేరుకునేసరికి ముగిసిన కార్యక్రమం
- లక్షల సంఖ్యలో రాకతో పోచంపాడ్ వద్ద జనసమ్మర్దం
- సభాస్థలికి వెలుపలే మూడింతల మంది ప్రజలు

నిజామాబాద్: ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రజలు పోటెత్తారు. సభ ప్రారంభమయ్యేసరికే లక్షల్లో హాజరుకాగా, పెద్ద ఎత్తున వాహనాలు రావడంతో ట్రాఫిక్ స్తంభించి, అంతకు మూడింతలమంది రోడ్లపైనే ఉండిపోయారు. పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయిందన్న సమాచారంతో వరంగల్, కరీంనగర్ పూర్వ జిల్లాలకు చెందిన ప్రజలు మోర్తాడ్, కమ్మర్‌పల్లి పరిసరాల్లోనే ఆగి, సభకు రాకుండానే వెనుదిరిగారు. సభ ముగిసే సమయానికి కూడా ప్రజలు వస్తూనే ఉండటంతో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. దీనికితోడు సభ ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణానికి ప్రజలు సిద్ధమవడంతో పోచంపాడ్ పరిసరాల్లో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించిపోయింది.

ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్లగొండ, ఖమ్మం పూర్వపు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఆర్టీసీ, స్కూల్ బస్సులు, డీసీఎంలు, ఇతర వాహనాల్లో జనం తరలివచ్చారు. శ్రీరాంసాగర్ క్రాస్‌రోడ్డు నుంచి రోడ్డు కిరువైపులా, మధ్యాహ్నం ఒంటి గంటవరకు 10 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. మంత్రి కే తారక రామారావు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. పెర్కిట్ ప్రాంతంలో ట్రాఫిక్‌లో చిక్కుకున్న తరువాయి 2లో

జగన్ ఉన్మాదం తారాస్థాయికి చేరుతోంది

అమరావతి: వైకాపా అధినేత జగన్ ఉన్మాదం రోజురోజుకీ తారాస్థాయికి చేరుతోందని ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. జగన్ అధికారం కోసం ప్రజలకు కీడు చేసేందుకు కూడా వెనకాడట్లేదని ఆరోపించారు.

తన రాజకీయ జీవితంగా ఇలాంటి విపరీత ధోరణి ఉన్న నేతను ఎన్నడూ చూడలేదన్నారు. ప్రజాస్వామ్య విలువలకు, రాజ్యాంగ తరువాయి 2లో

నంద్యాలను మరో పులివెందుల చేస్తా

- ప్రజలు ధర్మాన్ని కాపాడాలి
- ప్రలోభాలకు గురి కావద్దు
- మూడో రోజు రోడ్‌షోలో జగన్

నంద్యాల: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనకు నంద్యాల ఉప ఎన్నిక ద్వారా ప్రజలు తీర్పు ఇవ్వాలని ప్రతిపక్ష తరువాయి 2లో

కనులపండువగా మహా రథోత్సవం

ముగిసిన రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

బర్కత్‌పుర: బర్కత్‌పురలోని మంత్రాలయ శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో మూడు రోజులుగా జరుగుతున్న రాఘవేంద్రస్వామి 346వ ఆరాధనోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన మహా రథోత్సవ వూరేగింపు నేత్రపర్వంగా కొనసాగింది. అంతకుముందు మంత్రాలయ మఠంలో ఉత్తరారాధన నిర్వహించారు. విశ్రాంత డీజీపీ ప్రభాకర్ రావు, విశ్రాంత ఐఏఎస్ అధికారి సుధీర్, దైవజ్ఞశర్మ, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు

డీఎంకే వేడుకల్లో రజనీ, కమల్‌హాసన్

చెన్నై: తమిళనాడులో ప్రతిపక్ష పార్టీ ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే)కు చెందిన పార్టీ పత్రిక మురసోలి ప్రారంభించి నేటికి 75 సంవత్సరాలు. ఈ సందర్భంగా డీఎంకే పెద్ద ఎత్తున ప్లాటినమ్ జూబ్లీ వేడుకలను గురువారం చెన్నైలో ఘనంగా నిర్వహించింది. ఈ తరువాయి 2లో

Star Facilities with Economic Price @1399/-

Centrally located with good hospitality

- 32 " LED TV with USB drive
- E-Safe Locker
- Coffee / Tea Maker
- WIFI Internet
- 24 Hrs running hot/cold water
- Lift facility
- Standby Generator
- Complimentary Mineral Water Bottle

Hotel VB Grand

9-3-17, Beside NH-5, Opp. Automotive Manufacturers, Pithapuram Colony, Visakhapatnam-3
Cell : 07680-995759, 0891-2750555

టేకిట్ ఈజీ

నంద్యాల ఉప ఎన్నికల జోరు చూస్తుంటే ప్రచారాల పండగలా కనిపిస్తోంది. మరి విజయం ఎవరిని వరిస్తుందో చూడాలి!!

గోల్కొండ పరేడ్ కవాతు..



గోల్కొండ: చారిత్రక గోల్కొండ కోటలో జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పరేడ్ కృత్యాలు ప్రారంభమయ్యాయి. కోట ప్రధాన గేటు వద్ద గల ఉద్యానవనంలో పోలీసులు పరేడ్ నిర్వహించారు. రాణిమహల్ వద్ద జెండా ఎగురవేసే ప్రాంతంలో పాఠశాల విద్యార్థులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవంలో గురుకుల విద్యార్థులు వేదిక వద్ద త్రివర్ణ పతాకాలతో సందడి చేయనున్నారు. ముఖ్యమంత్రి జెండా ఎగరవేసే స్టేజీని ఏర్పాటు తరువాయి 2లో

వైభవంగా రాఘవేంద్రస్వామి ఉత్తరారాధన

సపేటె: పట్టణంలో స్వామి వారి ఉత్తరారాధనోత్సవాలు అత్యంత ఘనంగా జరిగాయి. నంజనగూడు రాఘవేంద్ర స్వామి మఠంలో, ఉత్తరాది మఠంలో కూడా భక్తులు పాల్గొన్నారు. ఉదయం పూరేగింపు నిర్వహించారు. స్థానికంగా ఉన్న మహిళా భజన మండలి వారు భజనలు చేస్తూ పూరేగింపులో పాల్గొన్నారు. కమలాపురలో కూడా ఉత్తరారాధన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. అక్కడ రాఘవేంద్రస్వామి రథోత్సవం జరిగింది. అంజుమన్ సమితి అధ్యక్షుడు మహ్మద్ ఇమాం నియాజి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గురుసార్వభౌముడి ఉత్తరారాధన

బళ్లారి : రాఘవేంద్రస్వామి 346వ ఆరాధన మహోత్సవాలు పురస్కరించుకుని స్థానిక తేరువీధిలోని నంజనగూడు రాఘవేంద్రస్వామి మఠంలో బృందావనానికి 21 రకాల పండ్లతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మూలరాముల ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి తేరువీధి, బెంగళూరు రోడ్డు, బ్రాహ్మణ బజారు మీదుగా మఠానికి చేరుకున్నారు. సత్యనారాయణపేటలోని రాఘవేంద్రుని మఠంలో రథాన్ని లాగారు. బృందావనాన్ని అలంకరించారు. రాయల్‌కాలనీ సంజీవరాయ రాఘవేంద్రమఠం, గురువాణి, యంత్రోద్ధారక రాఘవేంద్రుల మఠం, రాజ్‌కుమార్ ఉద్యానవనం వద్ద గల వెంకటేశ్వర రాఘవ మఠం, మోతి కూడలి వద్ద, వ్యాసరాజ మఠం, గురురాజ సేవాసమితి ఆధ్వర్యంలో కౌల్‌బజారు పాండురంగ ఆలయంలోనూ రాఘవేంద్ర తీర్థుల ఉత్తరారాధనను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం బృందావనాలను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

చివరి రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాఘవేంద్రుల బృందావనానికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో శ్రీమఠం ధర్మాధికారి రాజా బ్రహ్మణ్యతీర్థాచార్, గురురాజాచార్, వెంకణ్ణ, ఉంతకల్లు రాఘవేంద్రరావు, సుదీంద్రరావు, నేమకల్లురావు తదితరులు పాల్గొన్నారు.

గజరాజులకు బీమా భరోసా!

మైసూరు : దసరా ఉత్సవాల్లో పాల్గొనే గజరాజులకు అటవీ శాఖ బీమా చేసింది. ఉత్సవాల్లో పాల్గొనే 15 ఏనుగులు, 30 మంది మావటీలు, సహాయకులకు ఈ సదుపాయం వర్తిస్తుంది. వీరికి రూ.కోటి మేర బీమా చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఉత్సవాల్లో పాల్గొనే ఏనుగుల తొలి బృందం శనివారం నగరానికి రానుంది.

ఈనెల 17న రాజమందిర ప్రాంగణంలోకి వెళ్లేలా ముహూర్తాన్ని ఖరారు చేశారు. తొలి దశలో ఎనిమిది ఏనుగులు నగరానికి రానున్నాయి. నాగర శె జాతీయ అభయారణ్యంలోని వీరన సహల్లి అటవీ శిబిరం నుంచి ఏనుగులు బయలుదేరే ముందు సంప్రదాయ జానపద ప్రదర్శనలుంటాయి. ఈసారి ఉత్సవాల్ని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం తీర్మానించిన విషయం తెలిసిందే. ఉత్సవాలకు సంబంధించి జాతీయ, అంతర్జాతీయంగా ప్రచారాన్ని నిర్వహిస్తారు. ఉత్సవాలకు నగరాన్ని ముస్తాబు చేసేందుకు, నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 15 కోట్లను వ్యయం చేయనున్న విషయం తెలిసిందే.

మైలార మహదేవప్పకు రుణపడి ఉండాలి

బెంగళూరు : మహాత్మాగాంధీ పిలుపు మేరకు ఉప్పుసత్యాగ్రహం పోరాటంలో కర్ణాటక నుంచి పాల్గొన్న ఏకైక వ్యక్తి దివంగత మైలార మహదేవప్పకు అందరూ రుణపడి ఉండాలని కన్నడ సాహిత్య పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ మనుబళిగార్ పిలుపునిచ్చారు.

ఇక్కడ గాంధీభవన్‌లో కర్ణాటక గాంధీ స్మారక నిధి, మైలార మహదేవప్ప స్మారక సమితి, యువజన సర్వీసు శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉప్పు సత్యాగ్రహంలో ఆయన పాల్గొన్నట్లు అనేక మందికి తెలియదన్నారు. దేశం కోసం ఆయన ప్రాణాత్యాగం చేశారని, మహాత్ముడి ప్రధాన అనుచరుడిగా గుర్తింపు పొందారని, గాంధీ సిద్ధాంతాల్ని జీవితాంతం ఆచరించారని గుర్తు చేశారు. మహాత్మాగాంధీని తుపాకీతో కాల్చి హత్య చేసిన వ్యక్తితో పాటు, అక్కడ ఉన్న పోలీసులపై ప్రజలు దాడి చేసేందుకు ప్రయత్నించగా మహదేవప్ప అడ్డుకుని అహింసను బోధించారని వివరించారు.

ప్రతి ఒక్కరూ హిందూ ధర్మం పాటించాలి

వెంకటగిరి : ప్రతి ఒక్కరూ హిందూ ధర్మం పాటించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. డక్కిలి మండలంలోని దేవుని వెల్లంపల్లి పుణ్యక్షేత్రంలో సంపూర్ణ గ్రామ దేవాలయ సందర్శన రథయాత్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు హిందూ సంప్రదాయాలను తెలియజేయాలన్నారు. రథయాత్రకు తన తోడ్పాటును అందిస్తానన్నారు. హిందూ దేవాలయ ప్రతిష్ఠాపన పీఠం అధిపతి కమలానంద భారతి స్వామి మాట్లాడుతూ హిందు వుల్లో ఐక్యత అవసరమన్నారు. గ్రామస్థాయి నుంచి ధర్మ పరిరక్షణ చేయాలనే సంకల్పంతో ఈ రథయాత్రను ప్రారంభించామన్నారు. గ్రామాల్లో బృందాలను ఏర్పాటు చేసి వారి ద్వారా హిందూతత్వంపై ప్రచారం నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం తితిదే ఆధ్వర్యంలో రూ. 25 కోట్లు వెచ్చించి ప్రచారంతోపాటు దాదాపు 500 గ్రామాల్లో ఆలయాల నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. రథయాత్రలో భాగంగా వెయ్యి ఆలయాలను సందర్శించి, దాదాపు లక్ష మంది ఇళ్లకు వెళ్లి వారికి వెంకటేశ్వరస్వామి వారి కంకణం, పుస్తకం తదితర వస్తువులను అందజేస్తామన్నారు. స్వామి వారి హుండీ నుంచి తీసుకువచ్చిన రూపాయిని భక్తులకు ముడుపు రూపంలో అందజేస్తామన్నారు. లక్షమంది భక్తులతో స్వామివారి వద్దకు యాత్ర చేపడతామన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఛైర్మన్ పి.వి.ఆర్.కె. ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మఠాలు, పీఠాలు, సేవాసంస్థల సహకారంతో సమరసత ఫౌండేషన్ ఏర్పాటు చేసి గ్రామాల్లో హిందూ ధర్మంపై ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

తితిదే ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ముక్తేశ్వరరావు మాట్లాడుతూ అందరిని కలిపేది గుడి అన్నారు. రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి మన్మోహన్ సింగ్ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు తమ వంతుగా తోడ్పాటును అందిస్తామన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రథయాత్ర విజయవంతంగా సాగాలని గణపతి హోమ పూజలు నిర్వహించారు. హోమంలో పూర్ణాహుతి సమర్పించిన తరు వాత స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి వారిని దర్శించు కున్నారు.

సభానంతరం రథయాత్రను ఎమ్మెల్యే రామకృష్ణ, కమలానంద స్వామి, పలువురు ప్రారంభించారు.

ఎంపెడా డె%రెక్టర్ సురేష్‌రెడ్డి, హిందూ ధార్మికవేత్త హనుమాన్ చౌదరి, అర్చక మండలి ఛైర్మన్ రాజగోపాలచారి, దుర్భాకుల ప్రభాకర్ శర్మ, అఖిల భారత హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఛైర్మన్ లక్ష్మయ్య, కైలాసానందగిరి స్వామి, పొన్నారావు, శ్రీనివాసులు, గురుప్రసాద్, డక్కిలి ఎంపీపీ వెంకటరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు రామచంద్రయ్య, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజేశ్వరరావు, ఆర్టీసీ మాజీ ఛైర్మన్ శంకరరెడ్డి, కె.వి.కె. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలాం స్మారక మందిరానికి సందర్శకుల తాకిడి



చెన్నై : మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్మారక మందిరానికి సందర్శకులు పోటెత్తుతున్నారు. గత నెల 27వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ దీన్ని ప్రారంభించిన సంగతి విదితమే. ధనుష్కోటి రోడ్డులోని అరిచామునై ప్రాంతంలో ఉన్న ఈ మందిరానికి రోజురోజుకు సందర్శకుల తాకిడి పెరిగిపోతోందని అధి కారులు పేర్కొన్నారు. మామూలు రోజుల్లో 9 వేల మందిబీ వారాంతాల్లో ఈ సంఖ్య రెండిం తలుగా ఉంటోందని అధికారులు పేర్కొన్నారు. సందర్శకుల రద్దీ ఎక్కువగా ఉండటంతో 'తమిళనాడు స్పెషల్ పోలీసు' (టీఎన్ఎస్పీ) సిబ్బందిని భద్రత నిమిత్తం ఏర్పాటు చేసినట్టు ఎస్పీ ఓంప్రకాశ్ మీనా పేర్కొన్నారు. టీఎన్ఎస్పీ నుంచి 60 మంది పోలీసులు రెండు షిఫ్టులలో విధులు నిర్వహిస్తారని చెప్పారు. వీరిలో 40 మంది పగలు, మిగిలిన వారు రాత్రిళ్లు విధుల్లో ఉంటారని ఓంప్రకాశ్ పేర్కొన్నారు. 'డిఫెన్స్ రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్' (డీఆర్డీవో)నుంచి స్మారక మందిర నిర్వహణ కోసమని సిబ్బందిని ఏర్పాటు చేయ నున్నట్టు వివరించారు. సందర్శ కులు లోనికి వెళ్లే ప్రవేశ ద్వారం వద్ద అది.కారులు మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు నిర్వ హిస్తున్నారు. అరిచామునైలో మరింత పకడ్బం దీగా బందోబస్తును ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామని, గత వారం మదురైకి చెందిన 21 సంవత్సరాల వ్యక్తి సముద్రంలో స్నానానికి వెళ్లి మునిగిపోయాడని పోలీసులు గుర్తు చేశారు. పోలీసు విభాగం, తీర గస్తీ దళం ప్రత్యేకంగా సూచికలు ఏర్పాటు చేసి నప్పటికీ పర్యాటకులు కొందరు పట్టించు కోకుండా సముద్రంలో స్నానా నికి వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు.

ఈ ప్రాంతంలో కూడా పోలీసు నిఘాను బాగా ఏర్పాటు చేయనున్నట్టు ఆయన చెప్పారు. పర్యాటక విభాగం బ్యాటరీతో నడిచే బస్సులను ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆదివాసీల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిదీ

నెల్లూరు : ఆదివాసీలు హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జేసీ-2 వెంకటసుబ్బారెడ్డి అన్నారు. నెల్లూరు ఐటీడీఏ కార్యాలయంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలకు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలపై నాయకులు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. గిరిజన విద్యార్థులు చుదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు బద్దెపూడి రవీంద్ర మాట్లాడుతూ ఇంకా గిరిజన తండాలలో కనీస మౌలిక వసతులు లేకుండా జీవిస్తున్నారన్నారు. విద్యకు, వైద్యానికి, మౌలిక వసతులకు అందని గిరిజనులను గుర్తించి వారికి అన్ని వసతులు సమకూరులే చేయాలన్నారు. గిరిజన తండాల్లో రోడ్లు, కరెంట్లు, నీరు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి కాలనీలను గుర్తించి వారికి ప్రభుత్వం ద్వారా చేయూత ఇవ్వాలన్నారు. జిల్లాలో విద్యకు దూరమైన వారిని గుర్తించి విద్య అవకాశాలు కల్పించాలన్నారు. రాష్ట్రంలో అనేక గ్రామాల్లో గిరిజనులకు స్థిర నివాసం లేక, ఇళ్లు లేక జీవిస్తున్నారని, వారిని అభివ ృద్ధి చేయాల్సి ఉందన్నారు.

ఐటీడీఏ పీవో కమలకుమారి మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ముఖ్యమంత్రి అరకులో నిర్వహిస్తున్నారని, మన జిల్లా నుంచి ఎన్.ఎస్. ఎఫ్.టి.డి.సి. లబ్ధిదారులకు, పలువురికి రూ.12. 27 కోట్ల చెక్కు లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మన్యం ప్రాంతాలు అంతగా లేవని, గిరిజనులకు ప్రభు త్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలి పారు. వారి విద్యతోపాటు, గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు.

గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ రుణాలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. భూమి కొనుగోలు పథకం కూడా త్వరలో అమల్లోకి రానున్నట్లు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

ట్రాఫికర్..

ఆయన, అక్కడ నుంచి సభాస్థలికి చేరుకోవడానికి రెండు గంటలు పట్టింది. అప్పటికే సమావేశం ముగిసింది. దీంతో ఆయన అందరినీ కలిసి వెనుదిరిగారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుకూడా ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. మరోవైపు సభకు వచ్చినవారంతా ప్రాజెక్టును చూసేందుకు రావడంతో డ్యాం కూడా కిక్కిరిసిపోయింది.

ట్రాఫిక్ నియంత్రించిన ఉమ్మడి జిల్లా ఎస్పీలు

పునర్జీవ సభకు వచ్చిన ప్రజలను అదుపుచేయడంలో నిజామాబాద్ సీపీ కార్తికేయ, కామారెడ్డి ఎస్పీ శ్వేతారెడ్డి తీవ్రంగా శ్రమించారు. ఒకదశలో కామారెడ్డి ఎస్పీ ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ గెస్ట్‌హౌస్ ద్వారం వద్ద కానిస్టేబుల్ వలే నిలబడి ట్రాఫిక్‌ను నియంత్రించారు. మండుటెండలో ఆమె ఏకంగా ఆరుగంటల పాటు వాహనాలను క్రమపద్ధతిలో మళ్లించారు. నిజామాబాద్ సీపీ కార్తికేయ సైతం అనేక చోట్ల ట్రాఫిక్‌ను నియంత్రించారు. సభా స్థలిలో సభికులు ప్రవేశించే ద్వారాలవద్ద ఏర్పాటు చేసిన మెటల్ డిటెక్టర్లను పర్యవేక్షించారు. అక్కడ సరిగా విధులు నిర్వహించని కొందరు పోలీసులపై సీపీ కార్తికేయ ఆగ్రహం వ్యక్తం చేశారు.

గోల్కొండలో పరేడ్ కవాతు..

చేశారు. 65 మీటర్ల పొడవైన జెండాపోల్‌ను సిద్ధం చేస్తున్నారు. జెండా ఎగరవేసే ప్రాంగణంలో చౌకీలు అతిథులు కూర్చునేందుకు కుర్చీలు వేస్తారు. సీఎం లంగర్‌హౌస్ మీదుగా టిప్పుఖాన్‌పూల్‌బ్రిడ్జి, రామ్‌దేవ్‌గూడల మీదుగా కోటకు చేరుకుంటారు. కోట వద్ద దారిలోని ప్రహరీలకు అందమైన చిత్రాలు వేస్తున్నారు.

కనులపండువగా మహా రథోత్సవం

చేశారు. మఠం మేనేజర్ రాఘవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. బర్కత్‌పుర లింగంపల్లిలో గల శ్రీరాఘవేంద్రస్వామి బృందావన సమితిలో నిర్వహిస్తున్న ఆరాధనోత్సవాల ముగింపు సందర్భంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. జాతీయ బాల కార్మిక సలహామండలి వైస్ ఛైర్మన్ బి.వెంకటరెడ్డి, భాజపా నగర ఉపాధ్యక్షులు కన్నె రమేశ్‌యాదవ్, స్థానిక నేతలు శీర్‌సాగర్, కృష్ణకుమార్, హజారీబాబు, బృందావన సమితి కార్యదర్శి బీపీ రాఘవేందర్‌రావు, మేనేజర్ నర్సింహాచార్ పాల్గొన్నారు.

మొట్టమొదటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడే

గుర్తుచేయగానే సభ్యులంతా చప్పట్లతో హర్షాతిరేకాలను వ్యక్తంచేశారు. వెంకయ్య..1949, జూలై 1న ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా చవటపాలెంలో జన్మించారు. రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం తరువాత జన్మించినవాళ్లలో ఉపరాష్ట్రపతి అయిన మొట్టమొదటి వ్యక్తి వెంకయ్య నాయుడు గారు. ఇదొక అరుదైన సందర్భం. కేంద్ర మంత్రిగా దేశానికి ఆయన ఎంతో సేవ చేశారు. ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన విజయవంతం అయినందుకు ఎవరినైనా అభినందించాలంటే, అది ఒక్క వెంకయ్యను మాత్రమే! ఆయన తెలుగులో మాట్లాడితే సూపర్‌ఫాస్ట్‌గా ఉంటుందని, ఇన్నాళ్లు మాలో న్యాయవాదిలా కలిసుండి, ఇప్పుడు న్యాయమూర్తిలా ఛైర్మన్ స్థానంలో కూర్చున్నారు అని వ్యాఖ్యానించారు.

నంద్యాలను మరో పులివెందుల చేస్తా

నేత ప్రజలను కోరారు. పులివెందులను అభివృద్ధి చేసినట్టే నంద్యాలను అదేస్థాయిలో అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. నంద్యాల మండలంలో క్రాంతినగర్, చాపిరేవుల గ్రామాల్లో మూడో రోజు రోడ్‌షో నిర్వహించారు. చంద్రబాబు ఓటర్లకు ఎరవేస్తున్నారని, బుజ్జగింపులు, బెదిరింపుల ద్వారా ప్రలోభాలకు గురి చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ధర్మం వైపు నిలబడి ధర్మాన్ని కాపాడాలని కోరారు.

జగన్ ఉన్మాదం తారాస్థాయికి చేరుతోంది

ఔన్నత్యానికి జగన్ కళంకం తెస్తున్నారని ఆక్షేపించారు. ముఖ్యమంత్రి ఎన్ని తిట్లు తిడితే అన్ని ఓట్లు పడతాయని జగన్‌కు ఎవరో చెప్పినట్లున్నారని ఎద్దేవా చేశారు. సీఎం పదవి దక్కదనే అక్కసుతోనే జగన్ ఈ విధంగా ప్రవర్తిస్తున్నారని.. ఉన్మాద లక్షణాలున్న ఇలాంటి నాయకుడు ఇలాంటి ప్రతిపక్షనేతగా పనికిరాడన్నారు. జగన్ వ్యాఖ్యలపై ఎన్నికల సంఘం స్పందించి కఠినచర్యలు తీసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

డీఎంకే వేడుకల్లో రజనీ, కమల్‌హాసన్

వేడుకలకు సూపర్‌స్టార్ రజనీకాంత్, విలక్షణ నటుడు కమల్‌హాసన్, ప్రభుతో పాటు పలువురు తమిళ సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. అనారోగ్య కారణాల వల్ల ఈ వేడుకల్లో కరుణానిధి పాల్గొనలేకపోయారు. దాంతో ఆయన కుమారుడు డీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్ స్టాలిన్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

డీఎంకే అధినేత కరుణానిధికి 18ఏళ్ల వయసు ఉన్నప్పుడు ఈ మురసోలి పత్రికను ప్రారంభించారు. ఆగస్టు 10, 1942న తొలి మురసోలి పత్రిక విడుదలైంది. పెన్ నేమ్ చేరన్ పేరు మీద కరుణానిధి రచనలు చేసేవారు. ఏడు దశాబ్దాలుగా నిర్వరామంగా ఈ పత్రిక కొనసాగుతోంది. ఇప్పటికీ రోజుకు దాదాపు 60వేల ప్రతులు అమ్ముడుపోతున్నాయి.

గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

గుంటూరు : పేదరికం లేని సమాజం కోసం గిరిజనుల హక్కులను కాపాడుతూ చైతన్య వంతులను చేసి ఉన్నత స్థాయిలో వారిని నిలబెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. స్థానిక నగరం పాలెంలోని కేకేఆర్ పంక్షన్ హాల్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపా ల్‌రెడ్డి, కలెక్టర్ కోన శశిధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ భూమిలేని గిరిజను లకు భూములు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతులకు, మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పిస్తూ వారిని ఆదుకో డానికి

- మంత్రి పుల్లారావు

ప్రణాళికలు చేసిందని మంత్రి వివరించారు. జిల్లా కలెక్టర్ కోన శశిధర్ మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయా లను పరిరక్షిస్తూ.. వారిని ప్రగతిపథంలో ముందు కు నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లా డుతూ గిరిజనులు తమ హక్కులను కాపాడుకో వటానికి ఐక్యతతో మెలగాలని సూచించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, సాహు మహరాజ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లఅర్పించారు. కార్యక్రమంలో జేసీ-2 ముంగా వెంకటేశ్వరరావు, వివిధ గిరిజన సంఘాల నాయకులు కె.వెంకటేశ్వర్లు, కట్టా వెంకటేశ్వర్లు, కృష్ణానాయక్, శివానాయక్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

రెండు పడక గదుల నిర్మాణంతో ఇబ్బందులు దూరం



నిర్మల్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండు పడక గదుల నిర్మాణాలతో పేద ప్రజల ఇబ్బందులు దూరం కానున్నాయని గృహ నిర్మాణ సంస్థ రాష్ట్ర ఛైర్మన్ భూంరెడ్డి పేర్కొన్నారు. నిర్మల్ మండలం ఎల్లపెల్లి గ్రామంలో నిర్మిస్తున్న రెండు పడకగదుల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను దగ్గరుండి చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్లపెల్లిలో చేపడుతున్న నిర్మాణాలు ఎంతో బాగున్నాయని అక్కడ పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌ను అభినందించారు. పేదలు సరైన ఇళ్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, వాటిని చూసిన సీఎం కేసీఆర్ రెండు పడక గదుల నిర్మాణాలకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నిర్మాణాలు ఎంతో బాగున్నాయన్నారు. సొంతంగా కట్టుకున్నా ఇంత బాగా నిర్మించుకోని విధంగా పనులు జరుగుతున్నాయని, లబ్ధిదారులు ఎంతో సంతోషిస్తారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలు, రైతులు, ఇలా అన్ని వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చిందన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పునర్‌వైభవం తీసుకొచ్చేందు కోసం నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టడంతో భూములన్నీ సస్యశ్యామలం కానున్నాయన్నారు. వెంట ఆగ్రో ఛైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు, గృహ నిర్మాణ శాఖ నిజామాబాద్ ప్రాజెక్టు డైరెక్టర్, ఎస్ఈ చైతన్యకుమార్, నోడల్ అధికారి సూర్యచంద్రరావు, పంచాయతీరాజ్ డీఈఈ తుకారాం రాథోడ్, గృహ నిర్మాణశాఖ డీఈ నర్సయ్య, ఉన్నారు.

ప్రాథమిక హక్కులు, చట్టాలపై అవగాహన అవసరం: డీఎస్పీ

ఉట్నూర్ : విద్యార్థులు ఉపాధ్యాయులు సూచించిన సూచనలు పాటిస్తూ చదువులో రాణించడంతో పాటు చట్టాలు, ప్రాథమిక హక్కులపై అవగాహన పెంచుకోవాలని డీఎస్పీ చంద్రప్రభు సూచించారు. మండలంలోని లక్కారం ప్రభుత్వ పాఠశాలలో గరీబ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు భానోత్ జగన్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. నేటి సమాజంలో ప్రతీ ఒక్కరికీ చట్టాలపై పూర్తి అవగాహన ఉంటే సమాజంలో ఎలాంటి అక్రమాలు, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా దోహదపడుతాయన్నారు. విద్యార్థి దశ నుంచే చదువుపై ఆసక్తి చూపుతూ ఆట పాటల్లో కూడా రాణించేందుకు శ్రమించాలన్నారు. మీకు చట్టాలపై అవగాహన ఉంటే గ్రామీణ ప్రాంతాల్లోని చదువురాని నిరక్ష్యరాస్యులకు మీ తల్లిదండ్రులకు, ఇరుగుపొరుగు వారికి తెలియజేసేందుకు దోహదమన్నారు. ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లి తల్లిదండ్రుల, పాఠశాల పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన హరితహారం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు ఒక్కో మొక్క నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అనంతరం గరీబ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు భానోత్ జగన్ చట్టాల గురించి విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచి మర్సకోల తిరుపతి, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జాదవ్ శివాజీ నాయక్, భాదావత్ రాజన్న , ఉపాధ్యాయులు జగన్, లక్ష్మణ్ ,వీరయ్య ,శ్రీనివాస్ , అలాకుమార్, షీటీం పోలీసులు గరీబ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గణేష్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కదిలింది గులాబీ దండు

నిర్మల్ : ఉత్తర తెలంగాణ వర్రపదాయినిగా పిలుచుకునే ఎస్సారెస్పీ పునరుజ్జీవన సభకు నిర్మల్ నుంచి గులాబీ దండు కదిలింది. జిల్లా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలోనే ఉండటంతో వేలాది సంఖ్యలో దిచక్రవాహనాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ అప్పాల గణేశ్‌చక్రవర్తి ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం మైదానం నుంచి ఈ దిచక్రవాహన ప్రదర్శన ప్రారంభమైంది. పార్టీ జెండాలతో పట్టణమంతా గులాబీమయంగా మారింది. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తనయుడు గౌతంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎర్రవోతు రాజేందర్, తెరాస యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మారుగొండ రాము, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా పట్టణ సీఐ జాన్‌దివాకర్ చర్యలు చేపట్టారు. నిర్మల్ నుంచి పునరుజ్జీవన సభ 15 కిలోమీటర్ల దూరంలోనే ఉండటంతో సోన్ పరిసర ప్రాంతాల్లోని జాతీయ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. వందలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలకు సభకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఆదిలాబాద్, ఉట్నూరు, భైంసా, ఖానాపూర్ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది వాహనాలు ఇదే రహదారిపై వెళ్లాల్సి రావడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడంతో అవస్థలు ఎదుర్కొన్నారు.

వచ్చే ఎన్నికల్లో భాజపాకే పట్టం

తలమడుగు : గ్రామాలను అభివృద్ధి చేయడంలో తెరాస ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని 2019 ఎన్నికల్లో భాజపాకు ప్రజలు పట్టం కట్టనున్నారని భాజపా రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. తలమడుగులో కార్యకర్తలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ నరేంద్రమోదీ పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతోందని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తెరాస పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోలేదని ఆరోపించారు. రైతులు, పేద ప్రజల అభ్యున్నతి కోసం మోదీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాయితీపై అందించిన వ్యవసాయ పనిముట్లు అర్హులకు ఇవ్వకుండా తెరాస కార్యకర్తలకు మాత్రమే పంపిణీ చేశారని ఆరోపిస్తూ ఈ మేరకు ఎంపీడీఓ సునీతకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే మనాజీ, బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి మాధవ్‌రావు హమ్‌టే, మండల అధ్యక్షుడు భువనగిరి స్వామి, ఉపాధ్యక్షుడు శిరిష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మధుపై కేసులను ఎత్తివేయాలి: గుమ్మడి నర్సయ్య

కొత్తగూడెం : న్యూడెమోక్రసీ రీజనల్ కమిటీ కార్యదర్శి అవునూరి మధుపై విధించిన రాజద్రోహం, ఉపా కేసులను ఎత్తేయాలని ఇల్లెందు మాజీ శాసనసభ్యుడు గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు న్యూడెమోక్రసీ పట్టణంలో ప్రదర్శనను నిర్వహించి సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఉమర్ అధ్యక్షతన ఏర్పాటైన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చిన మధును, మరో ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు అక్రమంగా కేసులను బనాయించారని ఆరోపించారు. తెలంగాణ పోరాటంలో ప్రధానపాత్ర పోషించిన మధును తెలంగాణ ప్రభుత్వం రాజద్రోహిగా ముద్రవేయడం అమానుషమన్నారు. ఉద్యమక్రమంలో న్యూడెమోక్రసీ కేసీఆర్‌కు తెలిపిన మద్దతును వివరించారు. నాయకులు జె.సీతారామయ్య, అరుణ, మాచర్ల సత్యం, కందగట్ల సురేందర్, గోపాలరావు, ఎన్.సంజీవ్, సతీష్, గౌని నాగేశ్వరరావు, గణితి కోటేశ్వరరావు, వెంకట్రావు, చంద్రశేఖర్, భద్రమ్మ, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపూర్ బాగుంది

దేవరకొండ నియోజకవర్గ సర్పంచుల బృందం కితాబు

ఇబ్రహీంపూర్ : ఇబ్రహీంపూర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు బాగున్నాయని నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గానికి చెందిన సర్పంచులు అభిప్రాయపడ్డారు. వారు సిద్దిపేట మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంకుడుగుంతలు, మొక్కల పెంపకం, చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించారు. ఇంటింటా శౌచాలయాలు, శుద్ధినీటి సరఫరా, సోలార్ విద్యుత్తు వ్యవస్థ, నమూనా పంచాయతీ భవనం, మహిళా మండలి భవనాలను చూశారు. డంపింగ్ యార్డు, నమూనా పాఠశాల భోజనశాల, పశువుల పాకల నిర్మాణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు బాగున్నాయని, వీటిని మా గ్రామాల్లో అమలు చేయడానికి కృషి చేస్తామన్నారు. గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వినియోగం బాగుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లారెడ్డి, రోమాల బాబు, తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారం పీఆర్టీయూకే సాధ్యం

తలమడుగు : జిల్లాలో ఉపాధ్యాయులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించడం కేవలం తమ సంఘానికే సాధ్యమవుతుందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు దారట్ల జీవన్ అన్నారు. తలమడుగు జిల్లా పరిషత్తు సెకండరీ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల శాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఏకీకృత సర్వీసు నిబంధనల దస్త్రం రాష్ట్రపతి ఆమోదం పొందడంలో సంఘం పాత్ర మరువలేనిదన్నారు. సంఘ బలోపేతానికి సభ్యులందరూ సమష్టిగా కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న డిటెన్షన్ విధానాన్ని తమ సంఘం స్వాగతిస్తుందన్నారు. 398 మంది ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, పండిత్, పీఈటీల ఉన్నతీకరణ, 11వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేసి 2018 నూతన పీఆర్‌సీని వర్తింపజేయాలన్నారు.

అనంతరం వీరిద్దరిని సంఘం సభ్యులు సత్కరించారు. సమావేశంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేందర్‌యాదవ్, రవీందర్, జిల్లా కార్యదర్శి నవీన్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు శరత్ యాదవ్, రాష్ట్ర సంఘ సభ్యులు సాగర్, ప్రకాశ్‌గౌడ్, సుఖ్‌దేవ్, హేమలత, సుహాసిని, జగదీశ్, వినాయక్‌రావు, శ్రీనివాస్, రాజేందర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీబీసీఎస్ విధానంపై విద్యార్థులకు అవగాహన అవసరం

ఖమ్మం : డిగ్రీ విద్యార్థులకు సీబీసీఎస్ విధానంపై అవగాహన అవసరమని ఖమ్మం ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.యూ.వీరభద్రయ్య అన్నారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ విధానంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విజ్ఞతతో ప్రభుత్వ కళాశాలను ఎంపిక చేసుకున్నందుకు విద్యార్థులను అభినందించారు. స్వయం ప్రతిపత్తి ఉన్న కళాశాలగా, అనేక ప్రత్యేకతలున్న నేపథ్యంలో ప్రస్తుత సీబీసీఎస్ విధానం ఎంతో కీలకమైనందున విద్యార్థులు అంతర్గత పరీక్షలతోపాటు, సెమిస్టర్ విధానం తదితర విషయాలపై అవగాహన ఏర్పాటు చేసుకోవాలని కోరారు. వైస్ ప్రిన్సిపల్ ఏఎల్ఎన్ శాస్త్రి మాట్లాడుతూ మార్కుల విధానం గురించి వివరించారు. ఐక్యూ ఏసీ సమన్వయకర్త డాక్టర్.సుజాత పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సెమిస్టర్‌లో అధ్యయనం చేయనున్న సబ్జెక్టులు, మార్కులు, గ్రేడింగ్ విధానం గురించి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్స్ విభాగపు సమన్వయకర్త డాక్టర్ జకీరుల్లా, సహాయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ జే.రమేశ్, కామర్స్ అధ్యాపకులు మాధవి, బిందుశ్రీ, ఆర్థికశాస్త్ర అధ్యాపకురాలు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మూలవిరాట్‌కు అర్చకులు భక్తిశ్రద్ధలతో సుప్రభాతం పలికి ఆరాధన చేసి నామార్చనలు నిర్వహించారు. క్షేత్ర విశిష్టత ఆకట్టుకుంది. వైష్ణవ సంప్రదాయం ప్రకారం విష్వక్సేన పూజ నిర్వహించి పుణ్యాహ వాచనం నిర్వహించి కన్యాదానం చేశారు. కంకణ ధారణ జరిపి ప్రవరను పఠించి సీతమ్మకు యోక్త్రధారణ చేసి రామయ్యకు యజ్ఞోపవీత ధారణ నిర్వహించారు. మాంగళ్య ధారణ కడు రమణీయంగా నిర్వహించి తలంబ్రాల వేడుకను వైభవంగా జరిపారు. దర్బారు సేవ మంత్రముగ్ధులను చేసింది. పుష్పాంజలి సేవ జరగనుంది.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

ఆదిలాబాద్ : ఆదిలాబాద్ పట్టణంలోని వివిధ కూడళ్లలో ద్విచక్రవాహనాలను ఎత్తుకెళ్తున్న దొంగను ఆదిలాబాద్ పట్టణ పోలీసులు సీసీఎస్ సిబ్బంది సహాయంతో పట్టుకున్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు ఉన్నతాధికారి శ్రీనివాస్ డీపీవోలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణం లోని గాంధీచౌక్‌లో సీఐ సురేష్ సిబ్బందితో వాహన తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకుని విచారించగా, మహారాష్ట్రలోని అర్ని గ్రామానికి చెందిన సయ్యద్ ఫారూఖ్‌గా పోలీసులు గుర్తించారు. పట్టణంలోని పలుకూడళ్లలో ద్విచక్ర వాహనాలు దొంగలించానని, వాటిని మూతపడ్డ సీసీఐ పరిశ్రమలో దాచినట్లు ఫారూఖ్ చెప్పాడు. దాని ఆధారంగా తొమ్మిది వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దొంగకు సహకరించిన ఆయన సోదరుడు సయ్యద్ ఇక్బాల్ పరారీలో ఉన్నాడు. వాహనాల దొంగలపై దృష్టిసారిస్తామని ఎస్పీ వివరించారు.

కార్యక్రమంలో డీఎస్పీలు లక్ష్మీనారాయణ, నర్సింహారెడ్డి, పట్టణ సీఐ సురేష్, ఎస్సై బాఖీ, గుణవంత్‌రావ్, హెడ్ కానిస్టేబుళ్లు సిరాజ్ ఖాన్, వెంకటస్వామి, కానిస్టే బుళ్లు జాకీర్ అలీ, రమేష్, మంగళ్‌సింగ్, మహేందర్, తిరుపతి, రమణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

కవిత్వం హృదయ సౌందర్యాన్ని ఆవిష్కరిస్తుంది

తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు సిధారెడ్డి

సిద్దిపేట : కవిత్వం హృదయ సౌందర్యాన్ని ఆవిష్కరిస్తుందని, ఉద్విగ్న మానవ సంభాషణే కవిత్వమని తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా. నందిని సిధారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ-పీజీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో యూజీసీ సౌజన్యంతో తెలంగాణ సారస్వత పరిషత్ సంయుక్తంగా కవితా రచన రాష్ట్రస్థాయి కార్యశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన ప్రారంభించి మాట్లాడారు. సామాన్యుడి కష్టాలు, కన్నీళ్లను కవిత్వం ప్రతిబింబించగలిగే విధంగా కరుణ రసాత్మకం కావాలన్నారు. కవిత్వానికి పద్యం, గేయం, వచనం రూపాలు మాత్రమేనని.. మరోరకంగా వ్యక్తి అనుభవాలు, అనుభూతులను సైతం వ్యక్తీకరిస్తుందన్నారు. మానవీయ విలువలకు పట్టం కడితేతే ఉత్తమ కవిత్వంగా నిలుస్తుందన్నారు. డిగ్రీ కళాశాల వైవిధ్యమైన కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు. ఓయూ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ప్రొ. కసిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రసంగించారు. ధ్వని పూర్వకమైన కవిత్వమే ఉత్తమమని ప్రాచీన అలంకారికులు తెలిపారని వివరించారు. మహాభారతం, రామాయణం కావ్యాల అధ్యయనం ఉత్తమ కవిత్వ ఆవిష్కరణలకు బాటలు వేస్తుందన్నారు.

తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ప్రొ. శివారెడ్డి, సహాయక ఆచార్యులు జి.బాల శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ నేటి తరం కవితారచనలో మెలకువలను అలవర్చుకోవాలన్నారు. యువతరం మేలురకమైన రచనలను అధ్యయనం చేయాలని హితవు పలికారు. పద్య కవితా రచన అంశంపై డా. తిరుమలాచార్య, గేయ కవితా రచన అంశంపై డా. వడ్డేపల్లి కృష్ణ, వచన కవితా రచనపై కవి కోటేశ్వర్‌రావు మాట్లాడారు. మూడు దశల్లో కార్యశాల కొనసాగింది. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత వహించగా సారస్వత పరిషత్ కార్యదర్శి చెన్నయ్య స్వాగత ఉపన్యాసం చేశారు. కార్యశాల కార్యనిర్వాహక కార్యదర్శి డా. హరినాథశర్మ, యూజీసీ సమన్వయకర్త రవీందర్‌రెడ్డి, ఐక్యూఏసీ సమన్వయకర్త ఏవీ శర్మ, అధ్యాపకులు రమణి, రమేశ్‌బాబు, రామాచారి, శంకర్, దుర్గాప్రసాద్, పీడీ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోరుతూ ఉపాధ్యాయుల ర్యాలీ

నర్సాపూర్ : సీపీఎస్ రద్దు చేసి పాతపింఛను విధానం అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. నర్సాపూర్‌లో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు ఉద్యోగం చేసి చివరకు పింఛన్ లేకుండా జీవించడం కష్టంగా ఉందన్నారు. సెప్టెంబరు ఒకటిన పింఛన్ విద్రోహ దినంగా ప్రకటించాలని, ఆ రోజు ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి జిల్లా కలెక్టరు కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తారని తెలిపారు. ఇందుకు అన్ని ఉపాధ్యాయ సంఘాలు మద్దతు పలుకుతున్నాయని, ప్రతి ఒక్కరు ఇందులో పాల్గొనాలని కోరారు. అనంతరం ఆర్డీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మనోహరచక్రవర్తికి వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మోయిజోద్దిన్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సామ్యానాయక్, లాలు, శ్రీనివాస్‌రావు, రాంసింగ్, సుందర్‌రాజు, చందర్, చరణ్‌సింగ్, ఉపాధ్యాయులు మాధవి, వాణిశ్రీ, వినోద, స్వర్ణలత, రమేష్‌రాజు, గణేష్, రాజు, రవి, జెత్యా తదితరులు ఉన్నారు. కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానం వల్ల 35 ఏళ్లపాటు ఉద్యోగం చేసిన వ్యక్తికి ఆ తర్వాత భద్రత కరవవుతోందని, ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ అంధకారమవుతోందని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొండల్‌రెడ్డి అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టీపీటీఎఫ్, యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం మెదక్ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేసి పాతపింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ధర్నా అనంతరం తహసీల్దార్ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగయ్య, ఉపాధ్యక్షులు రమేశ్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పద్మారావు, ఆయా సంఘాల బాధ్యులు సురేందర్, ప్రవీణ్, కిషన్, భూషణం, శీతల్‌సింగ్, వర్రప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి, గణేశ్, పోచయ్య, వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

విజయభాను

సంపాదకీయం

ప్రాంతీయ స్పృహ

బీజేపీ ఇంకా వాఘేలా, నితీశ్ వంటి నాయకులపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడవలసి వస్తున్నది. కాంగ్రెస్ పార్టీ మాదిరిగా దీర్ఘకాలం దేశాన్ని పాలించడం ఇక ముందు ఏ జాతీయ పక్షానికి సులభం కాదు. కాంగ్రెస్ బలహీనపడితే ఆ శూన్యాన్ని ప్రాంతీయపక్షాలు భర్తీ చేస్తున్నాయి. ప్రాంతీయ పార్టీలు తమ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తాయి. ప్రాంతీయ స్పృహను సరైన కోణంలో అర్థం చేసుకోవాలే తప్ప, జాతీయ సమైక్యతకు వ్యతిరేకమైనదిగా ముద్ర వేయకూడదు. భవిష్యత్తులో ప్రాంతీయ అస్తిత్వ భావనలు ఇంకా బలంగా వినబడవచ్చు. ఈ భిన్నస్వరాలను ఎంతగా ఆస్వాదిస్తే, జాతీయ సమైక్యత అంతగా బలపడుతుంది. సార్వత్రిక ఎన్నికలు ఇంకా రెండేండ్లు కూడా లేకపోవడంతో, వివిధ రాష్ట్రాలలో రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. బీహార్‌లో రాతోరాత్ యూపీఏ ప్రభుత్వం కూలిపోయి తెల్లారి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డది. గుజరాత్‌లో పటీదార్ల ఆందోళన మొదలుకొని అనేక కారణాలు బీజేపీ వ్యతిరేక పరిస్థితిని సృష్టించడంతో కాంగ్రెస్ లాభపడుతుందనే అభిప్రాయం ఉండేది. కానీ కాంగ్రెస్ పార్టీకి శంకర్ సింగ్ వాఘేలా రాజీనామా చేసి కొత్త పార్టీ పెట్టుకున్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు కాంగ్రెస్‌కు మళ్ళకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గుజరాత్‌లో బీజేపీ తెరచాటు రాజకీయం ఎంత జోరుగా నడుస్తున్నదో రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా వెల్లడైంది. యూపీ, బీహార్, గుజరాత్ వంటి రాష్ట్రాలలో బీజేపీ బలంగా ఉన్నది కనుక పావులు కదుపడం, ఆట కట్టడం తేలిక. కానీ అదే ఆట హిందీయేతర రాష్ట్రాలలో చెల్లుబాటవుతుందా అనేది సందేహమే. ప్రత్యేకించి దక్షిణాదిన అడుగు పెట్టడం, నిలదొక్కుకోవడం అంత సులభం కాదని తమిళనాడు పరిణామాలు గమనిస్తే అర్థమవుతుంది. జయలలిత మరణం తరువాత, అక్కడి రాజకీయాలను ప్రభావితం చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నది. కానీ బహిరంగంగా బయట పడటానికి సాహసించడం లేదు. ఏదో ఒక తమిళ రాజకీయపక్షాన్ని ముందు పెట్టుకొని మాత్రమే వ్యవహరిస్తున్నది. బీజేపీ రజనీకాంత్‌ను చేర్చుకొని కొన్ని చిన్నాచితక పార్టీలను కూడ గట్టి పోటీ లో నిలుస్తుందనే ఊహాగానాలు వినిపించాయి. కానీ ఈ ప్రయోగం విజయవంతం అవుతుందనే ధీమా బీజేపీలో, రజనీకాంత్‌లో కనిపించడం లేదు. డీఎంకేకు సన్నిహితంగా వ్యవహరిస్తున్న మరో సూపర్‌స్టార్ కమల్ హాసన్ ఇప్పట్లో ఏ నటుడూ (తానూ, రజనీకాంత్) రాజకీయాల్లో ప్రవేశించడానికి తగిన పరిస్థితులు లేవని తేల్చి చెప్పారు. తమిళనాడులో 1967 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం దేశ రాజకీయాలలో చరిత్రాత్మక ఘటనగా చెప్పుకోవచ్చు. ఐదు దశాబ్దాల తరువాత జాతీయ రాజకీయపక్షాలకు ఉన్న పరిమితులు, ప్రాంతీయ పార్టీలకున్న అనుకూలత మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయి. తమిళ ప్రజల ముందుకు ఇప్పటికీ బీజేపీ ధైర్యంగా వెళ్ళలేకపోతున్నది. భారతీయ సమాజం ఏకశిలా స్వరూపం అనే మౌలిక భావనతో బీజేపీ ముందు కుపోతే, బహుళత్వ సమాజం నుంచి సవాళ్ళు ఎదురవుతయి. ఇప్పుడు కర్ణాటక లో ఇదే పరిస్థితి ఏర్పడ్డది. వచ్చే ఏడాదిలో జరిగే అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోతుందని, తమ గెలుపు ఖాయమని బీజేపీ ఇప్పటివరకు భావించింది. కర్ణాటక జనాభాలో 20 శాతానికి పైగా ఉన్న లింగాయతులు బీజేపీ వైపు ఉండటం ఆ పార్టీ పెద్దల ఆత్మవిశ్వాసానికి కారణం. కానీ హటాత్తుగా కర్ణాటక రాజకీయ చిత్రం మారిపోయింది. లింగాయతులు తమను హిందువుల్లో భాగంగా కాకుండా, ప్రత్యేక మతంగా గుర్తించాలని కోరుతున్నారు. 12వ శతాబ్దంలో బసవేశ్వరుడు కుల వ్యవస్థ వంటి సామాజిక రుగ్మతలకు వ్యతిరేకం గా ఉద్యమించిన నేపథ్యంలో ఆయనను అనుసరించిన వారే లింగాయతులు. వైదిక మత శాఖలలో ఒకటైన వీర శైవానికి తమకు సంబంధం లేదని వీరు అంటున్నారు. సిక్కు, జైనం మాదిరిగా వైదిక విశ్వాసాలకు తమ మతం భిన్నమైనదని లింగాయత పీఠాధిపతులు అంటున్నారు. ఇటీవల బీదర్‌లో జరిపిన లింగాయత మహాసభకు రెండు లక్షల మంది హాజరయ్యారు. వీరి డిమాండ్లను కేంద్రానికి పంపిస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అంటున్నారు. దీనివల్ల లింగాయతుల మద్దతుపై ఆశ పెట్టుకున్న బీజేపీ ఇరుకున పడ్డది. భారతీయ సమాజంలో భిన్నత్వం ఎక్కువ కనుక ఉదారవాద స్వభావం కలిగి ఉంటుంది. లౌకిక ప్రజాస్వామ్య భావజాలం కూడా పాతుకుపోయి ఉన్నది. కాంగ్రెస్ పార్టీ ఉదారవాద ప్రజాస్వామిక స్వభావం కలిగి ఉండటం వల్లనే ఇంతకాలం నిలబడగలిగింది. సంక్షేమ పథకాలు, స్వావలంబన విధానాలు ఆ పార్టీ ఆర్థిక దృక్పథాన్ని ఇచ్చాయి.

కుంబ్లేకు మాజీ కెప్టెన్ మద్దతు

న్యూఢిల్లీ: ఇటీవల భారత క్రికెట్ ప్రధాన కోచ్ పదవి నుంచి వైదొలిగిన అనిల్ కుంబ్లేకు భారత మాజీ కెప్టెన్ మొహ్మద్ అజహరుద్దీన్ మద్దతుగా నిలిచాడు. భారత క్రికెట్ జట్టు కోచ్ పదవికి గుడ్ బై చెప్పి కుంబ్లే సరైన నిర్ణయం తీసుకున్నాడని అజహర్ అభిప్రాయపడ్డాడు. ఈ పదవి నుంచి కుంబ్లే అర్థాంతరంగా వైదొలగడానికి అతను ఆత్మభిమానాన్ని చంపుకుని పని చేయడం ఇష్టలేకపోవడమే ప్రధాన కారణం కావొచ్చన్నాడు. ఇక్కడ కెప్టెన్ విరాట్ కోహ్లి, భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బీసీసీఐ) వైఖరిని పరోక్షంగా అజహర్ తప్పు బట్టాడు. 'అనిల్ కుంబ్లే ఆత్మాభిమానం చంపుకోకుండా పదవి నుంచి వైదొలిగాడు. కుంబ్లే అలా తప్పుకోవడం నాకు చాలా బాధ కలిగించింది. ఉన్నతమైన వ్యక్తిత్వం కల్గిన అతనికి ఈ విధంగా జరిగి ఉండకూడదు. కుంబ్లేది ఎవరినీ ఇబ్బంది పెట్టే మనస్తత్వం కాదు. బహుశా.. ఆత్మాభిమానం వదులుకోవడం కంటే కోచ్ బాధ్యతల నుంచి తప్పుకోవడమే మంచిదని కుంబ్లే భావించి ఉంటాడు. ఏది ఏమైనా కుంబ్లే తీసుకున్న నిర్ణయం సరైనదే'అని అజహరుద్దీన్ పేర్కొన్నాడు.

18 కోట్ల మంది వీక్షించారు..!

లండన్: ఇటీవల ఇంగ్లండ్ లో ముగిసిన మహిళల ప్రపంచకప్‌కు రికార్డు స్థాయిలో ఆదరణ లభించింది. ప్రపంచవ్యాప్తంగా 18 కోట్ల మంది ఈ టోర్నీని తిలకించినట్లు అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) వెల్లడించింది. 2013 వన్డే ప్రపంచకప్‌తో పోలిస్తే ఈ మెగా టోర్నీని వీక్షించిన సమయంలో 300 శాతం పెరిగినట్లు ఐసీసీ పేర్కొంది. అదే సమయంలో భారత్ , దక్షిణాఫ్రికాల్లో అత్యధిక మంది ప్రేక్షకులు మ్యాచ్ లను వీక్షించినట్లు స్పష్టం చేసింది.

భారత్ లో గతంలో ఎన్నడూ లేని విధంగా 15.6 కోట్ల మంది మహిళల ప్రసారాలను వీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎనిమిది కోట్ల మంది చూడగా, ఒక్క ఫైనల్ పోరును 12.6 కోట్ల మంది వీక్షించారు. భారత జట్టు ఫైనల్ కు చేరడంతో భారత్ లో వీక్షణ సమయం 500 శాతం పెరిగింది. దీనిపై ఐసీసీ సీఈవో డేవిడ్ రిచర్డ్ సన్ హర్షం వ్యక్తం చేశారు. 'మహిళల క్రికెట్ ను ముందుకు తీసుకెళ్లడానిక ఇదే తగిన సమయం. ఈ మెగా టోర్నీతో మహిళల క్రికెట్ ఆదరణ పెరిగింది. దానికి నిదర్శనం ఈ లెక్కలే'అని ఆయన పేర్కొన్నారు.

ఉబర్ మాజీ సీఈవో కలానిక్‌కు కొత్త కష్టాలు

శాన్‌ఫ్రాన్సిస్కో : రైడ్-హైలింగ్ సంస్థ ఉబర్‌ను స్థాపించి, దానికి ప్రపంచవ్యాప్తంగా ఓ గుర్తింపంటూ తీసుకొచ్చిన ఆ కంపెనీ మాజీ సీఈవో ట్రావిస్ కలానిక్‌ను కొత్త కష్టాలు ఎదురవుతున్నాయి. సమస్యల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న కంపెనీని, వాటి నుంచి బయట పడేసేందుకు ఇన్వెస్టర్ల ఒత్తిడితో సీఈవో పదవి నుంచి తప్పుకున్న ఈయనపై తాజాగా మోసపూరిత దావా నమోదైంది. ఉబర్ అతిపెద్ద ఇన్వెస్టర్లలో ఒకటైన బెంచ్‌మార్క్ వెంచర్ కలానిక్‌పై యుద్ధానికి దిగింది. మోసం, ఇతర అతిక్రమణల పేరుతో ఆయన్ను ఉబర్ బోర్డు నుంచి కూడా తొలిగించేందుకు సిద్ధమైంది. సిలికాన్ వ్యాలీ వెంచర్ క్యాపిల్ సంస్థ అయిన బెంచ్‌మార్క్, గురువారం డెలావేర్ ఛాన్సరీ కోర్టులో కలానిక్‌పై ఫిర్యాదు నమోదుచేసింది. ఈ ఫిర్యాదులో ఉబర్ మాజీ ఎగ్జిక్యూటివ్ మోసానికి పాల్పడినట్టు, విశ్వసనీయతకు, కాంట్రాక్ట్‌కు తూట్లుపొడిచినట్టు ఆరోపించింది. అంతేకాక 2016లో పలు బోర్డు సీట్లను కలానిక్ ఎలా తన ఆధీనంలోకి తెచ్చుకున్నారో వివరించింది.

ఉబర్ బోర్డులో కలానిక్‌కు స్థానం ఉండటం అక్రమమని, చెల్లనిదిగా బెంచ్‌మార్క్ క్యాపిటల్ తన ఫిర్యాదులోనే పేర్కొంది. ఉబర్ సీఈవోగా కలానిక్ బాధ్యతలు వహించేటప్పుడు పలు స్కాండల్స్ బయటికి వచ్చాయి. దీంతో బలవంతంగా ఆయన్ను సీఈవో పదవి నుంచి తప్పించారు. ప్రస్తుతం కొత్త సీఈవోగా వెతుకుతున్నట్టు రెండు రోజుల క్రితమే ఆ కంపెనీ సహవ్యవస్థాపకుడు గారెట్ క్యాంప్ చెప్పారు. అంతేకాక ఉబర్ సీఈవో పదవిలోకి ఇక ట్రావిస్ కలానిక్ రారని కూడా వెల్లడించారు. ఇదే విషయాన్ని బెంచ్‌మార్క్ క్యాపిటల్ కూడా ప్రకటించింది. తాజాగా బోర్డు సభ్యుడిగా కూడా ట్రావిస్ కలానిక్‌ను దించేయడానికి బెంచ్‌మార్క్ క్యాపిటల్ ప్రయత్నాలు ప్రారంభించింది.

అయితే ఈ దావాలో ఉన్న ప్రతీ అంశం నిరాధారమేనని, తప్పు అని కలానిక్ అధికార ప్రతినిధి చెప్పారు. కలానిక్ సీఈవోగా లేకపోయినా షాడో లీడర్‌గా కొనసాగాలని ఇతరులు కోరుకుంటున్నట్టు తెలిసింది. ఈ దావా సిలికాన్ వ్యాలీలో ఉన్న స్టార్టప్‌ల గవర్నెన్స్ సమస్యలను ఎత్తిచూపుతోందని విశ్లేషకులంటున్నారు. ఇటీవల స్టార్టప్ వ్యవస్థాపకులే తమ కంపెనీల్లో ఎక్కువ అధికారాలు పొందుతున్నారు. ఇన్వెస్టర్ల కంటే కూడా ఎక్కువగా, అన్ని ఓటింగ్ రైట్స్‌ను తమ ఆధీనంలో ఉంచుకుంటున్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం.. 36 మంది మృతి

బీజింగ్: చైనాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ ప్యాసింజర్ బస్సు హైవే గోడను ఢీకొట్టడంతో సుమారు 36 మంది మృతి చెందగా 13 మంది వరకు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన గత రాత్రి నార్త్‌వెస్ట్ చైనా శాంక్సి ప్రావిన్స్‌లోని గ్జియాన్ హంజోంగ్ హైవేపై జరిగింది.

ఈ బస్సు చెంగ్డూ పట్టణం నుంచి హెనాన్ ప్రావిన్స్‌లోని లుయాంగ్‌కు బయలు దేరిందని, క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించనట్లు స్థానిక మీడియా పేర్కొంది.

సమయం

గీతార్థం యిదిగో

- గీత ఒక కల్ప వృక్షము
- అది శ్రీ కృష్ణునిచే నాటబడినది
- వ్యాసునిచే పెంచబడినది
- ఉపనిషత్తులు దాని విత్తనములు
- జ్ఞాన ప్రభోదమే దాని అంకురం
- వివిధ శాస్త్ర రహస్యములు దాని కొమ్మలు
- విషయ విరక్తి, సహనము దాని చిగుళ్లు
- పరమాత్మ యొక్క పద్మముల పాద పద్మముల యందు
- భక్తియే దాని పుష్ప సుగంధం
- మోక్షమే దాని ఫలం
- నీవు దేవునివైపు ఒక అడుగు వేసినచో
- దైవం నీ వైపు పది అడుగులు వేయును
- నీ కర్తవ్యం నీవు చిత్తశుద్ధితో చేసినచో
- దైవం నీవు పొందవలసిన ఫలితం కన్న ఎక్కువే యిచ్చును
- కొండ గృహంలోనికి వెళ్లి అది పలుకలేదే అని తలంపకుము
- నీవు ధ్వని చేయి - అది ప్రతిధ్వని చేయును
- ధనముతో వస్తువులను కొనగలము
- కాని మనఃశాంతిని కొనలేము
- ప్రలోభాలకు లొంగని మనస్సు ప్రశాంతంగా ఉంటుంది.

... కవితా రచన
శ్రీ స్వామి అప్పాజి భగవాన్
సెల్ నెం: 98486 44336

పంచాంగం

మాసం : శ్రావణ : పంచమి రా. 9.34 ఉత్తరాభాద్ర ఉ. 6.09
రేవతి రా.తె. 5.33 వ.సా. 5.51ల 7.24
శనివారం 12-08-2017

మేషం : విద్యార్థులకు దూర ప్రాంతాల్లో ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. నిరుద్యోగులు భేషజాలకు పోకుండా ఏ చిన్న అవకాశం దొరికినా సద్వినియోగం చేసుకోవటం మంచిది. వృత్తుల వారికి అన్ని విధాలా కలిసిరాగలదు. పాతమిత్రుల కలయిక కొత్త అనుభూతినిస్తుంది.

వృషభం : వైద్యులకు శస్త్రచికిత్స చేయు నపుడు మెళుకువ అవసరం. ధన వ్యయం, చెల్లింపులలో మెలకువ వహించండి. కాంట్రాక్టర్లు, బిల్డర్లకు నిర్మాణ పనులలో ఊహించని చికాకు లెదుర్కోవలసి వస్తుంది.

మిధునం : ఆకస్మికంగా ప్రయాణాలు వాయిదాపడతాయి. స్త్రీలకు ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. భాగస్వామికుల మధ్య కొత్త విష యాలు చర్చకు వస్తాయి. లీజు, ఏజెన్సీలు, నూతన కాంట్రాక్టులు అనుకూలిస్తాయి. విద్యార్థి నులకు ప్రేమ వ్యవహారాల్లో భంగపాటు తప్పదు. మిత్రులను కలుసుకుంటారు.

కర్కాటకం : రియల్ ఎస్టేట్ రంగాల వారికి ఊహించని చికాకులు ఎదురవుతాయి. గతంలో నిలిపివేసిన పనులు పునఃప్రారంభిస్తారు. ఖర్చులు పెరిగినా ప్రయోజనకరంగా ఉంటాయి. కోర్టు వ్యవహారాలు, ఆస్తి పంప కాలు ఒక కొలిక్కి వస్తాయి. వ్యాపారాల్లో పెరిగిన పోటీని తట్టుకోవటానికి బాగా శ్రమించాలి. ఆలయాలను సందర్శిస్తారు.

సింహం : సాంఘిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మీ పనుల సాను కూలతకు పలుమార్లు తిరగవలసి ఉంటుంది. బ్యాంకు నుంచి పెద్దమొత్తంలో నగదు డ్రా చేసే విషయంలో జాగ్రత్త అవసరం. పాత వస్తువులను కొంటే ఇబ్బందులు తప్పవు.

కన్య : రాజకీయ నాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. మీ సమర్థతపై ఎదుటివారికి విశ్వాసం ఏర్పడుతుంది. కొబ్బరి, పండ్ల, పూల, కూరగాయల వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి. దుబారా ఖర్చులు అధికం.

తుల : రావలసిన ధనం చేతికందడంతో రుణం తీర్చాలనే మీ యత్నం నెరవేరుతుంది. స్త్రీల పట్టుదల వల్ల కుటుంబ సౌఖ్యం అంతగా ఉండదు. దంపతుల మధ్య అన్యోన్యత నెలకొంటుంది. హోటల్, కేటరింగ్ రంగాల్లో వారు పనివారితో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఒకానొక సందర్భంలో మిత్రుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది.

వృశ్చికం :నిత్యావసర వస్తు వ్యాపారులకు స్టాకిస్టులకు పురోభివృద్ధి. బంధువుల రాక వల్ల మీరు కొంత అసౌకర్యానికి లోనవుతారు. దైవ సేవా కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటారు. కోర్టు వ్యవ హారాలు కొత్త మలుపు తిరుగుతాయి. మీ మాటే నెగ్గాలన్న పంతం విడ నాడండి.

ధనుస్సు : స్త్రీలు కుటుంబ పరిస్థితులతో సర్దుకుపోవడం క్షేమ దాయకం. నూతన పరిచయాలు మీ పురోభివృద్ధికి నాంది పలుకుతాయి. ధనం ఏ కొంతైనా నిల్వ చేయటం వల్ల సంతృప్తి కానవస్తుంది. ధనం ఏ కొంతైనా నిల్వ చేయటం వల్ల సంతృప్తి కానవస్తుంది. ఉపాధ్యాయులు విశ్రాంతికై చేయు యత్నాలు వాయిదా పడ తాయి.

మకరం :మనశ్శాంతి కోసం కొన్ని విషయాల్లో సర్దుకు పోవటం క్షేమదాయకం. మీ సంతానం అత్యుత్సాహాన్ని అదుపులో ఉంచటం మంచిది. స్త్రీలకు పనివారితో ఒత్తిడి, చికాకులు తప్పవు.

కుంభం : మీ ఏమరుపాటుతనం వల్ల పత్రాలు విలువైన వస్తువులు చేజారిపోయే ఆస్కారం ఉంది. రాజకీయాలలో వారికి ప్రత్యర్థులు పెరుగుతున్నారు అని గమనించండి. ప్రముఖుల కలయికతో పనులు సానుకూలమవుతాయి.

మీనం : ఉపాధ్యా యులకు అదనపు బాధ్యతలు, పనిభారం వంటి చికాకులు తప్పవు. స్త్రీలపై శకునాలు, చుట్టుపక్కల వారి వ్యాఖ్యలు తీవ్ర ప్రభావం చూపుతాయి. కాంట్రాక్టర్లకు రావలసిన బిల్లుల వసూలులో ప్రయాసలను ఎదుర్కొంటారు.

అక్షింతల పరమార్థం తెలుసుకుందాం...

సంకీర్తన

చంద్రుడికి ప్రీతిపాత్రం

నవగ్రహాల్లో ఒక్కో గ్రహానికి ఒక్కో ధాన్యాన్ని దానవస్తువుగా పేర్కొంటారు. ఆ రకంగా నవగ్రహాలలో చంద్రుడికి ప్రీతి కరమైన దానవస్తువు బియ్యం. జ్యోతిషశాస్త్రం ప్రకారం చంద్రుడు మనస్సుకు అధినాయకుడు. మనిషి మనసు, బుద్ధి, గుణము, తల్లి, వ్యసనము ఇత్యాదులన్నీ చంద్ర కారకాలే అని అన్నారు పెద్దలు. అందుకే మనిషిపై చంద్రుడి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆ చంద్రుడికి సంకేతమైన బియ్యం కూడా మనిషి మనస్సుపై ప్రభావం చూపుతుంది. మనోధర్మాన్ని నియంత్రిస్తాయి.

దీవెన పరమార్థం

శాస్త్రీయంగా చూస్తే, మనిషి దేహం ఓ విద్యుత్ కేంద్రం. విద్యుత్ సరఫరాల్లో హెచ్చుతగ్గులు సాధారణం. ఈ వ్యత్యాసాలు మనిషి మనస్సు మీద, ఆరోగ్యం మీద ప్రభావాన్ని చూపుతాయి. మనుషుల్లో తమో, రజో, సాత్త్వికాలనే త్రిగుణాలకూ కారకము. పెద్దలు వధూవరులపై అక్షతలు చల్లి ఆశీర్వదించే సమయంలో, దేహం లోని విద్యుత్తులో కొంత బాగం ఈ అక్షతలను తాకుతాయి. ఆశీస్సులు ఇచ్చే వాళ్ల నుంచి, పుచ్చుకొనే వాళ్ల కొంత విద్యుత్ బదిలీ అవుతుంది.

ఈ కారణంగా అక్షతల ద్వారా పెద్దలలో ఉండే సాత్విక గుణం పిన్నలకు లభిస్తుందనేది మన నమ్మకం.

పెద్దలు, విద్వాంసులు, గురువులు, తల్లి దండ్రులు, అత్తమామలు వివాహ సమయంలో, శుభకార్యాలలో మనకు అక్షతలు వేసి శిరస్సును తాకి ఆశీర్వదించడంలోని ఆంతర్యం, పరమార్థం ఇదే!

జీవుడికి సంకేతం

మరో సిద్ధాంతం ప్రకారం చూస్తే మనిషి దేహంలో విద్యుత్ కేంద్రాలు ఇరవై నాలుగు ఉంటాయట. వాటిలో ప్రధానమైనది శిరస్సు. ఇది విద్యుదుత్పత్తి కేంద్రమే కాదు. విద్యుత్ ప్రసార కేంద్రం కూడా. తలపై అక్షింతలు వేయడం ద్వారా వాటిలోని విద్యుత్‌ను గ్రహించి దేహానికి ప్రసారం చేస్తుంది శిరస్సు.అది సరే కాని! అక్షతలుగా ఉపయోగించే బియ్యానికి పసుపు కుంకుమలు కలపడం ఎందుకు? ఆయుర్వేదం ప్రకారం, చర్మ సంబంధ రోగాల్ని అడ్డుకునే శక్తి పసుపుకు ఉంది. పసుపు నుంచి తయారయ్యే కుంకుమకూ ఈ శక్తి ఉంది. అక్షతలు వేసే వారికి ఎలాంటి రోగ సమస్యలున్నా, పుచ్చు కొనే వాళ్ళకి అవి సోకకుండా ఈ పసుపు కుంకుమలు నివారిస్తాయట. అంతేకాక పసుపు కుంకుమలు శుభానికి సంకేతాలు కూడా. ఆధ్యాత్మికంగా చెప్పాలంటే జీవుడికి సంకేతం బియ్యం.

భగవద్గీతలో ప్రస్తావన

అన్నాద్భవన్తి భూతాని అని మూడవ అధ్యాయంలో శ్రీకృష్ణ పరమాత్ముడు చెప్పాడు. జీవులు అన్నం చేత పుడతారట. ఈ అన్నం తయారీకి మనం ఉపయోగించే ధాన్యం బియ్యం. భగవంతునిపై అక్షతలు వేసి నమస్కరించడం అంటే, జీవుడు ఈ అన్నంలో పుట్టీ, తిరిగి ఈ జీవుడిని భగవంతుడిలోకి చేర్చడమే. అక్షతలలో ఇంతటి పరమార్థం గోచరిస్తుంది.తెలుగులో ఈ అక్షతలని తలంబ్రాలు లేదా తలబ్రాలు అని కూడా అంటారు. తలను:తల యందు పోయబడే, ప్రాలు:బియ్యం అని అర్థం.

ధాన్యలక్ష్మికి ఆహ్వానం

పూర్వం వధువు ధాన్యలక్ష్మిగా చెప్పబడింది. ఈ తలంబ్రాల కార్యక్రమంలో బియ్యానికి ఒక ప్రత్యేకత ఉంది. ఓ వధువా! నీవు మా ఇంటికి వచ్చాక, మన ఇంట ధాన్యం ఇలా కుప్పతెప్పలుగా విరివిగా ఉండి, మన జీవనానికి ఆధారభూతమైన ధాన్యంతో మనం నిత్య సంపదల వాళ్ళమై తులతూగుతూ ఉండాలి అనే భావానికి అనుగుణంగా ఈ తలంబ్రాల కార్యక్రమం సాగుతుంది.

వివాహకర్మ పరమార్థం

వరుడు, వధువు శిరస్సులపై తలంబ్రాలు పోసుకొనే దానికి ముందు, వరుడు ముందుగా వధువు చేతిని దర్భతో తుడిచి, దోసిలిలో రెండు మార్లుగా బియ్యాన్ని వేసి, ఆ మీదట పాలని కొద్దిగా చల్లి తలంబ్రాలకి సిద్ధం చేస్తాడు. తలంబ్రాలు వేసాక వధువు ఇలా చెయ్యాలని ఒక పద్ధతి చెబుతుంది. ఈ కాలంలో పురోహితులే చేయించి పోయిస్తున్నారు.ఈ కన్య వంశాన్ని తరింప జేయుగాక పుణ్యం వృద్ధి చెందుగాక.

-- సశేషం --

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట

తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ గుత్తా, కలెక్టర్ ఉప్పల్, జడ్పీఛైర్మన్ బాలు, ఎమ్మెల్యే రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల గిరిజన సేవా సమితి, తీజ్ కమిటీ ఆధ్వర్యంలో స్థానికంగా తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న తీజ్ వేడుకలు ముగిశాయి. ముగింపు వేడుకల్లో ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ బాలునాయక్, ఎమ్మెల్యే రవీంద్రకుమార్, నల్గొండ జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు. స్థానిక మల్లెల గట్టుపై గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వారు మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ గుత్తా మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. జడ్పీ ఛైర్మన్ బాలునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనులకు 12శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. త్వరలో గిరిజన తండాలన్నీ గ్రామపంచాయతీలు కానున్నాయని ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలోని 40 గిరిజన తండాల ప్రజలు ఏకతాటిపై నిలిచి తీజ్ వేడుకలను నిర్వహించడం అభినందనీయని జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ అన్నారు. ఈ సందర్భంగా మల్లేపల్లిలో బంజార భవన్ నిర్మాణం కోసం సర్వే నెంబర్ 107లో గల ప్రభుత్వ భూమిలో ఒక ఎకరాన్ని కేటాయించాలని బంజార నాయకులు కలెక్టర్‌కు విన్నవించగా స్పందించిన కలెక్టర్ వెంటనే నివేదిక పంపాలని వేదికపై ఉన్న ఆర్డీవో లింగ్యానాయక్‌కు సూచించారు. భవన నిర్మాణం కోసం ఎంపీ రూ.25 లక్షలు, జడ్పీ ఛైర్మన్ రూ.10 లక్షలు, ఎమ్మెల్యే రూ.10 లక్షలను తమకోటా నుంచి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తీజ్ కమిటీ అధ్యక్షుడు ఆర్.దస్రూనాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీపీ మేకల శ్రీనివాస్‌యాదవ్, జడ్పీటీసీ సభ్యుడు ఆలంపల్లి నర్సింహ, వైస్ ఎంపీపీ డా.వేణుధర్‌రెడ్డి, సర్పంచి అందుగుల ముత్యాలు, ఉపసర్పంచి కుంభం శ్రీనివాస్‌గౌడ్, డీఎస్పీ రవికుమార్, ఎంపీడీవో విజయలక్ష్మి, సీడీపీవో సక్కుబాయి, తహసీల్దార్ కిరణ్మయి, ఆలయ కమిటీ ఛైర్మన్ కుంభం పుల్లారెడ్డి, చెన్నారం, శ్రీను, మధు, లాలునాయక్ పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించుకుంటేనే అభివృద్ధికి నిధులు

బజార్‌హత్నూర్ : ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న మరుగుదొడ్లను నిర్మించుకొని గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహితంగా తీర్చిదిద్దితే నిధులు వాటంతటా అవే వస్తాయని జిల్లా పాలనాధికారి బుద్ధప్రకాష్ ఎం.జ్యోతి అన్నారు. మండలంలోని జాతర్ల పరిధిలో గల చింతకర్ర, మోర్కండి పరిధిలోని ఉప్పర్‌పల్లి గ్రామంలో నిర్మిస్తున్న మిషన్ భగీరథ పనులను ఆయన పరిశీలించారు. మిషన్ భగీరథ ట్యాంకులను పరిశీలించి నాణ్యత, పనులకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. చింతకర్ర గ్రామానికి రహదారి సౌకర్యం సరిగ్గా లేదని గ్రామస్థులు పాలనాధికారికి విన్నవించారు. గ్రామంలో ప్రతిఒక్కరూ ఇంటింటికి మరుగుదొడ్డి నిర్మించుకొని స్వచ్ఛ గ్రామంగా మారినప్పుడే తమ గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. మండల, గ్రామ అధికారులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో వంద శాతం మరుగుదొడ్లు నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ శివారులో కొనసాగుతున్న అక్రమ మొరం తవ్వకాలను నిలిపివేయాలని తహసీల్దార్ రాజేందర్‌సింగ్‌ను ఆదేశించారు. అనుమతులు లేకుండా ఇష్టారీతిన తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఈఓపీఆర్డీ బాస్కర్, ఏఓ ప్రమోద్‌రెడ్డి ఏపీఓ శివాజీ, ఏపీఎం గణేష్, ఎంఈఓ శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చైతన్య, పంచాయితీ కార్యదర్శులు భూపాల్‌రెడ్డి, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జులై 1 తరవాత ఆమోదం పొందిన పనులకు జీఎస్టీ

మహబూబ్‌నగర్ : పంచాయతీరాజ్ పనులు జులై 1 అనంతరం ఆమోదం పొందినవాటికి జీఎస్టీ వర్తిస్తుందని రాష్ట్ర ఈఎన్‌సీ సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన హైదరాబాదు నుంచి జిల్లా అధికారులతో వీసీ నిర్వహించారు. జూన్ 31లోపు అనుమతులు పొందిన వాటికి జీఎస్టీ వర్తించదని తెలిపారు. పంచాయతీరాజ్ పరిధిలో మండల, నియోజకవర్గ రహదారులు, నాబార్డు, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద మంజూరైన పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో డిప్యూటీ ఈఈలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్థానికంగా నివసించని అధికారులపై వేటు

దేవరకొండ నగర పంచాయతీపై కలెక్టర్ సమీక్ష

దేవరకొండ : దేవరకొండ నగర పంచాయతీలో నెలకొన్న సమస్యలు జిల్లా వరకు వస్తున్నాయని, వాటిని ఇక్కడ పరిష్కరించడంలో ఎందుకు విఫలమవుతున్నారంటూ జిల్లా కలెక్టర్ గౌరవ్‌ఉప్పల్ నగర పంచాయతీ అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవరకొండ నగర పంచాయతీలో ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కలెక్టర్ గౌరవ్ ఉప్పల్, ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పంచాయతీ ఛైర్మన్, అధికారులు, కౌన్సిలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రతి గ్రీవెన్స్‌లో దేవరకొండ నగర పంచాయతీకి సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయని మీ పనితీరు బాగాలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పట్టణంలో తాగునీరు, పారిశుద్ధ్యం సమస్య విపరీతంగా ఉందని, చిన్నారులు జ్వరాల బారిన పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పెండ్లిపాకల వాటర్ ఫిల్టర్‌బెడ్ నుంచి పట్టణానికి అదనంగా కృష్ణాజలాలు తీసుకొచ్చేందుకు మరో మోటార్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాల్సిందిగా గతంలోనే సూచించినప్పటికీ ఎందుకు స్పందించటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో జంతు ప్రదర్శన తరహాలో కోతులు, పందులు, పశువులు, కుక్కలు తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయని కౌన్సిలర్లతో పాటు స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందిస్తూ పందుల నివారణకు యజమానులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆర్డీవో లింగ్యానాయక్‌కు ఆదేశించారు. కోతులను పట్టే నిపుణులను పిలిపించి వాటిని అడవుల్లో పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రణాళిక అధికారి అంజయ్య స్థానికంగా ఉండడం లేదని నల్గొండ నుంచి వస్తున్నారని స్థానిక ప్రజాప్రతినిధులు తెలపడంతో కలెక్టర్‌తో పాటు ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా ఉండని ఏ అధికారి, సిబ్బంది అయినా సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆర్డీవో లింగ్యానాయక్, నగర పంచాయతీ ఛైర్మన్ కేతావత్ మంజ్యానాయక్, కమిషనర్ పూర్ణచందర్, వైస్ ఛైర్మన్ నల్లగాసు జాన్‌యాదవ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలకు జియోట్యాగింగ్

జడ్పీ సీఈవో హనుమా నాయక్



పెన్‌పహాడ్ : ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ఆయా శాఖల అధికారులు సమర్థంగా అమలు చేయాలని జడ్పీ సీఈవో హనుమా నాయక్ అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో దస్త్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హరితహారం, స్వచ్ఛభారత్ మిషన్‌పై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతీ ఇంటికి మరుగు దొడ్డి నిర్మించుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని గ్రామాల్లో హరితహారం ద్వారా నాటిన మొక్కలను సంరక్షించేందుకు స్వచ్ఛందంగా హరిత దళం కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.మండల స్థాయి అధికారులతో ప్రత్యేక కమిటీలు నెలకొల్పి హరితహారాన్ని విజయవంతం చేయాలన్నారు. హరితహారంతో నాటిన మొక్కలను ఉపాధిహామీ సిబ్బంది జియో ట్యాగింగ్ చేయాలని పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణాలు నూరు శాతం పూర్తి చేయించి బహిరంగ మల మూత్ర విసర్జన నిర్మూలన జిల్లాగా ప్రకటించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జడ్పీ సీఈవో మొక్క నాటారు. ఆయన వెంట ఎంపీడీవో అలివేలు మంగమ్మ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజంతోనే అభివృద్ధి సాధ్యం: కలెక్టర్

కొత్తగూడెం : ఆరోగ్యకర సమాజంతోనే అభివృద్ధిని సాధించవచ్చని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ అన్నారు. రామవరం ప్రభుత్వోన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ దయానందస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే విజయాలను సాధించడం సాధ్యపడుతుందన్నారు. కడుపులో ఉండే నులిపురుగులు పలు అనారోగ్య సమస్యలను సృష్టిస్తాయని, వీటి నివారిస్తే విద్యార్థుల్లో ఉత్సాహం ఇనుముడిస్తుందన్నారు. జీర్ణశక్తి పెరగటంతోపాటు స్వీకరించిన ఆహారంలోని పోషకాలు శరీరానికి అందుతాయని, దీంతో చురుకుదనం పెరిగి, శారీరక, మానసిక సమస్యలు దూరమవుతాయన్నారు. బాలికల్లో రక్తహీనతకు నులిపురుగులే ప్రధాన కారణమని వాటిని పూర్తిగా నియంత్రించాలన్నారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు నులిపురుగుల నివారణకు చిన్నారులకు అల్బెండెజోల్ మాత్రలను అందిస్తున్నామని, రెండేళ్లలోపు చిన్నారులకు సగం, 19ఏళ్ల లోపు వారికి ఒక మాత్ర చొప్పున అందిస్తున్నామన్నారు. ఇప్పుడు ఈ ఔషధాలను తీసుకోవడంలో విఫలమైన వారికి ఈ నెల 23న మరోసారి అందిస్తామన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి హయగ్రీవాచార్య, జిల్లా ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త డా.వినోద్, ఉపాధ్యాయులు, ఆసుపత్రి సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

15న జనహిత- సమీకృత ఫిర్యాదుల కేంద్రం ప్రారంభం

జిల్లా పాలనాధికారి సత్యనారాయణ

కామారెడ్డి : ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించడంతోపాటు, పారదర్శకత, జవాబుదారీ తనం పెంపొందించేందుకు ఈ నెల 15న జిల్లాలో జనహిత - సమీకృత ఫిర్యాదుల కేంద్రం ప్రారంభిస్తున్నట్లు జిల్లా పాలనాధికారి సత్యనారాయణ తెలిపారు. తన ఛాంబర్‌లో నూతన వెబ్ ఐఎన్‌టీసీ ద్వారా ఏర్పాటు చేసే జనహిత సమీకృత ఫిర్యాదుల కేంద్రం ఏర్పాటుపై ప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాలనాధికారి మాట్లాడుతూ.. అన్ని శాఖల సమగ్ర సమాచారం, ప్రజాఫిర్యాదులు, సంక్షేమ పథకాల అమలు, వివాహ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, భూ వివరాలు, తదితర సమగ్ర సమాచారం జనహిత, సమీకృత ఫిర్యాదుల కేంద్రంలో ఉంటుందన్నారు. కేటాయించిన ఆన్‌లైన్, వాట్సాప్ ద్వారా ప్రజలు లాగిన్ కావాలని తెలిపారు. దీని ద్వారా ప్రజలు తమకు కావాల్సిన సమాచారం, సంక్షేమ పథకాల అమలు వంటివి పొందవచ్చన్నారు. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో వెబ్‌సైట్ ఉంటుందన్నారు. ప్రజావాణిలో అపరిష్కృతంగా ఉన్న దరఖాస్తులను ఈ విధానం ద్వారా త్వరగా పరిష్కరిస్తామన్నారు. భారం తగ్గడంతోపాటు, సమయం కలిసి వస్తుందని పేర్కొన్నారు.

ప్రభుత్వాల అండదండలతోనే ఇసుక అక్రమ రవాణా

నాగార్జునసాగర్ : దేశంలోని నదులను కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కృష్ణానది పరిరక్షణ కమిటీ సభ్యులు బొలిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఆయన నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లో రాజేంద్రసింగ్, విక్రం సోనిల ఆధ్వర్యంలో ఏర్పాటైన నదుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో దేశంలోని నదుల పరిస్థితులపై అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. నేడు దేశంలోని అనేక నదులు ఎండిపోవడానికి గల కారణం నదులలో ఇసుకను తరలించడంతో నీటి కొరత ఏర్పడుతుందన్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో ఇప్పటికి దేశంలో ఎండిపోయిన 30 నదులలో నీరు పారేవిధంగా తయారు చేసినట్లు తెలిపారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రభుత్వాల అండదండల కారణంగానే నదులలోని ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని చెప్పారు. ఈ కమిటీ ఆధ్వర్యంలోని బృందాలు దేశంలో చిన్ని, పెద్ద 101 నదులను పరిశీలించి అవి ఎండిపోవడానికి కారణాలను పరిశీలించి ఆగష్టు 16, 17, 18 తేదీల్లో బీజాపూర్‌లో నిర్వహించు సదస్సులో చర్చించడం జరుగుతుందన్నారు.

కృష్ణానదిపై ఉన్న సమస్యలను తెలుసుకోవడానికి తాము ఆగష్టు 1న కృష్ణానది సముద్రంలో కలిసే హంసలదీవి ప్రాంతం నుంచి ఈ యాత్ర ఆగష్టు 15న బీజాపూర్‌కు చేరుతుందన్నారు. అక్కడ జాతీయ నీటి సంరక్షణ సదస్సును నిర్వహించ నున్నట్లు సదస్సులో వివిధ నదులను పరిశీలించి వచ్చిన ప్రతినిధులు నదుల ఇబ్బందులను వివరించడం జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సుకు రాజేంద్రసింగ్, విక్రంసోనిలతో పాటు నీటిపారుదలశాఖాధికారులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బొలిశెట్టి సత్యనారాయణ, శివకుమార్, గిరిబాబు, పాండురంగా రావుతదితరులు పాల్గొన్నారు.

చిన్నారెడ్డిది అవగాహనా రాహిత్యం

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి

వనపర్తి : ఆర్డీఎస్, జూరాల ప్రాజెక్టులను పునరుజ్జీవింపజేయాలని వనపర్తి శాసనసభ్యుడు చిన్నారెడ్డి చేస్తున్న నిరాహారదీక్ష ప్రజలను తప్పుదోవ పట్టించడమే కాకుండా.. ఆయన సాంకేతిక అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాతబల్లపై ప్రాజెక్టుల వారీగా వివరణ ఇస్తూ మాట్లాడారు. 60 ఏళు ఎమ్మెల్యేలు, మంత్రులుగా ఉన్నవారి నిర్వాకంతోనే తెలంగాణ అభివృద్ధికి నోచుకోకపోతే కొట్లాడి తెచ్చుకున్నామన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పనిచేసిన చిన్నారెడ్డి ఏ సాంకేతిక పరిజ్ఞానంతో మాట్లాడుతున్నారో.. ఆయనకే తెలియాలని, వనపర్తి నియోజకవర్గంలో ఆయన ప్రయత్నంగా ఒక్క ఎకరానికీ నీరు తీసుకు రావడంతో విఫలమైన ప్రజాప్రతినిధిగా ఆయన అభివర్ణించారు. వనపర్తి జిల్లాకు నీరుతెచ్చే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 2015 జూన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేస్తే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలెవరూ రాలేదని విమర్శించారు. వారి హయాంలో జరగనిది తెరాసలో అవుతోందని కుళ్లుకున్నారని దుయ్యబట్టారు. ఇదే పాలమూరు ఎత్తిపోతలను చిన్నారెడ్డి బహిరంగంగా వ్యతిరేకించిన మాట తెలంగాణవాసులు ఇంకా మరవలేదన్నారు.

జిల్లాకు నీరు కావాలన్న చిత్తశుద్ధి ఉంటే ఇలా ప్రజలను తప్పుదోవ పట్టించబోరన్నారు. ఏదుల రిజర్వాయరు నుంచి నియోజకవర్గానికి 30వేల ఎకరాలకు అదనంగా నీరు తెస్తామని, కేఎల్ఐ, పాలమూరులతోనే నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందన్నారు. జూరాల నీరు నియోజకవర్గంలోని పెబ్బేరుకే వస్తుందని, ఆర్డీఎస్ కింద వనపర్తికి ఒక ఎకరానికి నీరు రాదన్నారు. అలాంటప్పుడు దీక్ష దేనికని ఆయన ప్రశ్నించారు. ఆర్డీఎస్ నుంచి 15.9 టీఎంసీల నీటి వాటాను సద్వినియోగం చేసుకోవడంలో భాగంగా సుంకేసుల నుంచి తుమ్మిళ్ల ఎత్తిపోతల ద్వారా 9టీఎంసీలు తీసుకుంటున్నా మన్నారు.

ఈ ఏడాదిలోగా నడిగడ్డకు నీరిస్తామన్నారు. బచావత్ ట్రైబ్యునల్ ప్రకారం జూరాలను 18 టీఎంసీలతో నిర్మించాలని అనుకున్నా ఆనాటి నాయకులు పట్టించుకోని కారణంగా 12 టీఎంసీలకే నిర్మించారన్నారు. ఇప్పుడు ప్రాజెక్టు, నీటి సామర్థ్యాన్ని పెంచుకోవడం సాంకేతికంగా సాధ్యమా అని ప్రశ్నించారు. తెరాస అధికారంలోకి వచ్చి ఉమ్మడి జిల్లాలో వైద్య, వ్యవసాయ, మత్స్య కళాశాలను తీసుకొచ్చామన్నారు. పుర అధ్యక్షుడు రమేష్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు లక్ష్మయ్య, కౌన్సిలర్లు వాకిటి శ్రీధర్, లోక్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై..రైల్వే పోలీసుల నిఘా

రైళ్లలో తరలుతున్న వైనం

కాచిగూడ : మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై రైల్వే పోలీసులు దృష్టి సారించారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు ఎంపిక చేసుకున్న కొన్ని ప్యాసింజర్ రైళ్ల ద్వారా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను కొందరు గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్న వైనం వారి దృష్టికి వచ్చింది. రోడ్డు మార్గంలో చెక్‌పోస్టులతోపాటు పోలీసుల తనిఖీలు, నిఘా అధికంగా ఉండటం వల్ల అక్రమార్కులు గంజాయి తరలింపునకు రైలు మార్గాన్ని ఎంచుకున్నారు. బ్యాగులలో గంజాయి పెట్టుకుని సామాన్య ప్రయాణికుల తరహాలో తరలిస్తున్నారు. వ్యాపారులు అక్రమ రవాణాకు అమాయకులను వినియోగించుకుంటున్నారు. వారికి డబ్బు ఆశ చూపి ఫలానా చోట అందజేయాలని పంపిస్తున్నారు. రైల్వే పోలీసులకు పట్టుబడుతున్న వారిలో ఇలాంటి వారే అధికంగా ఉంటున్నారు. తెలంగాణలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, సినీ రంగ ప్రముఖుల వినియోగం నేపథ్యంలో రైల్వే పోలీసులు వాటికి అడ్డుకట్ట వేయడానికి జులై 17న స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇది సత్ఫలితాన్ని ఇచ్చింది.

ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లోని అటవీ ప్రాంతాల్లో గంజాయిని సాగు చేస్తున్నారు. అక్రమార్కులు అక్కడ కిలో గంజాయిని రూ.1000 నుంచి రూ. 2000 వరకు కొనుగోలు చేస్తున్నారు. అక్కడి నుంచి గంజాయిని రైళ్ల ద్వారా నగరం మీదుగా ముంబయి, పుణె, దిల్లీకి తరలిస్తున్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. అక్కడ గంజాయికి ఉన్న డిమాండ్‌ను బట్టి కిలో రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు విక్రయిస్తున్నారు.గంజాయి రవాణాకు అమాయకులకు డబ్బును ఎరగా వేస్తున్నారు. గంజాయి బ్యాగులను తీసుకెళ్లి తాము చెప్పిన చోట ఇచ్చి వచ్చినందుకు ఒక్కొక్కరికి రూ.2 వేల వరకు ఇస్తున్నట్లు కాచిగూడలోని రైల్వే హైదరాబాద్ లైన్ పోలీసులకు వికారాబాద్ వద్ద గత నెల 20న పట్టుబడ్డ ఒడిశాలోని బరంపురానికి చెందిన దంపతులు బంకుల్ బెహరా(40)- సొజని(30) విచారణలో వెల్లడించారు. వారి నుంచి 32 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఒడిశాలోని బరంపురం నుంచి పుణెకు వీరు గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారు. రైళ్లలో తీసుకెళితే ఎవరూ గుర్తించరనే దీమాతో గంజాయిని లగేజీ బ్యాగులలో పెట్టి రవాణా చేస్తున్నారు. దీంతో రైల్వే పోలీసులు కోణార్క్, లోక్‌మాన్య తిలక్, గోదావరి, గౌతమి, దేవగిరి, నవజీవన్, విశాఖ తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు నాందేడ్ తదితర ప్యాసింజర్ రైళ్లపై దృష్టి కేంద్రీకరించారు. సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ పరిధిలో 12 ప్రత్యేక రైల్వే పోలీస్ తనిఖీ, నిఘా బృందాలను ఏర్పాటు చేశారు. తనిఖీలు నిర్వహించి పెద్ద మొత్తంలో గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

ఈ అవగాహన అత్యవసరమే..!

మీరు మిత్రుడితో కలిసి మాట్లాడుకుంటూ రోడ్డుమీద నడుస్తున్నారు. అకస్మాత్తుగా అతడు స్పృహ తప్పాడు... ఏం చెయ్యాలి? ఇంట్లో ఒక్కసారిగా తాతయ్య మాటల్లో తడబాటు కనిపించింది... ఎందుకని? ఆ మార్పు ప్రమాదకరమా? రోడ్డు మీద వెళ్తున్నపుడు అకస్మాత్తుగా ఒకరు ఫిట్స్‌తో పడిపోయారు... మనం ఏదైనా సాయం చెయ్యగలమా? ఎప్పుడూ లేనిది కడుపు పై భాగంలో నొప్పి అనిడిటి కావచ్చని అనుకుంటాము... అది నిజంగా అనిడిటినే అయి ఉంటుందా..? లేక మరేదైనా ప్రమాదకరక స్థితి కాదు కదా? ఇలాంటి వన్నీ ఒక్కోసారి అత్యవసర పరిస్థితులకు దారి తియ్యవచ్చు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులను గుర్తించడం.., సమయానికి స్పందించడం... గురించిన వివరాలు

అత్యవసర పరిస్థితి చెప్పి రాదు; అది ఎప్పుడైనా ఎదురు కావచ్చు. ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఎవరికైనా ఏర్పడనూ వచ్చు. అలాంటి స్థితిని ఎదుర్కోవడానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలి. అది మనతో ఉన్న వారు అకస్మాత్తుగా స్పృహ తప్పటం, ఎవరికైనా షాక్ కొట్టడం, ఎవరైనా పై నుంచి కింద పడిపోవడం, ఎప్పుడూ లేని విధంగా కడుపులో నొప్పి రావడం, ఇంట్లో ఎవరికైనా స్ట్రోక్ రావడం, రోడ్డు మీద ఎవరికైనా ఫిట్స్ రావడం ఇలా అత్యవసర స్థితి ఎప్పుడైనా ఏరూపంలోనైనా ఎదురు కావచ్చు. అత్యవసర పరిస్థితి ఏర్పడినపుడు ఎలా స్పందించాలనే విషయాల గురించి తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి.

స్పృహ తప్పితే...

అనుకోకుండా మన వెంట ఉన్న వారు స్పృహ తప్పి పడిపోతే ముందుగా మనకు చాలా కంగారు కలుగుతుంది. ఏం చెయ్యాలో తోచదు. అయ్యో...అయ్యో... అనడం మినహా వెంటనే కర్తవ్యం బోధపడదు. అయితే స్పృహ తప్పిన వారిని ప్రమాదం నుంచి బయట పడెయ్యాలంటే అన్నింటికంటే ముందుగా మనం అలా కంగారు పడకుండా ఉండడం అవసరం. ఒకవేళ కంగారు పడినా వెంటనే సర్దుకోవాలి. పడిపోయిన వారిని గట్టిగా కుదిపి లేపి చూడాలి. గట్టిగా వారి పేరు పెట్టి పిలవాలి. ఒకవేళ వారు స్పందించగలిగితే అది ఒకింత మేలైన స్థితిగా భావించవచ్చు. ఎలాంటి స్పందన లేకపోయినట్టయితే సాయం కోసం ఎవరినైనా అభ్యర్థించడం మంచిది.

గొంతు కింద చెయ్యి పెట్టి అక్కడ కొట్టుకునే నాడిని పరీక్షించి చూడాలి. ఇక్కడ కొట్టుకునే నాడిని కెరొటెడ్ పల్స్ అంటారు. అక్కడి నాడీ స్పందన కనిపించకపోతే వెంటనే కార్డియోపల్మనరీ రీ సజిటేషన్(సీపీఆర్) అనే ప్రథమ చికిత్స చెయ్యాలి. ఇందులో భాగంగా ఒకచేతి మీద మరో చేతిని ఉంచి బాధితుడి ఛాతి మధ్య భాగంలో బలంగా ఒత్తిడి కలిగించాలి. ఈ ఒత్తిడి ఎంత బలంగా ఉండాలంటే లోపలికి ఛాతిని ఒత్తినపుడు అది దాదాపు రెండు అంగుళాల మేర లోపలికి వెళ్లాలి. అలా 30 సార్లు ఒత్తిడి కలిగించిన తర్వాత బాధితుడి ముక్కు మూసేసి నోటిని నోటితో మూసేసి బలంగా రెండు సార్లు ఊపిరి తిత్తులలలోకి గాలి ఊదాలి. ఇలా వంద సార్ల వరకు ఒత్తిడి కలిగించాలి. గాలి ఊదాలి. ఇది 30:2 నిష్పత్తిలో ఉండాలి. అంటే 30 సార్లు ఒత్తిడి కలిగించి 2 సార్లు గాలి ఊదాలి. ఇలా 5 నిమిషాలు చేసి తిరిగి సీపీఆర్ కొనసాగించాలి. నాడి తిరిగి కొట్టుకోవడం మొదలు పెట్టే వరకు ఈ చికిత్స కొనసాగించాలి.

ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫ్యూజర్ ఉపయోగిం చవచ్చు. ఇది ఆ సమయంలో షాక్ అవసరమా కాదా అనేది కూడా నిర్ణయిస్తుంది. దీనిలో మూడు బటన్స్ ఉంటాయి. మొదటిది ప్యాడ్స్‌ను బాధితులకు అమర్చడానికి, రెండోది హృదయస్పందనను విశ్లేషించడానికి, మూడోది షాక్ అవసరమా కాదా నిర్ణయించడానికి ఉపయోగపడతాయి. దీనిని ఎవరైనా ఉపయోగించవచ్చు. నిజానికి ఇది అన్ని పబ్లిక్ ప్లేస్‌లలో అందుబాటులో ఉండాలి.

మూర్ఛ

మూర్ఛతో బాధపడేవారిని చూసినపుడు చాలా భయం కలుగుతుంది. ఎలా స్పందించాలో కూడా అర్థం కాదు. అందరూ ఒకరకమైన ఆందోళనతో చూట్టూ చేరతారు. కొంత మంది కాస్త ధైర్యం చేసి వారి చేతికి ఏ ఇనుప వస్తువునో, తాళం చేతుల గుత్తినో అందించేందుకు ప్రయత్నం చేస్తారు. అయితే దీనితో పెద్దగా ప్రయోజనం లేదనేది నిపుణుల మాట. ఎవరికైనా మూర్ఛ వచ్చినపుడు కొన్ని ప్రత్యేకమైన జాగ్రత్తలు పాటించడం వల్ల రోగికి కొంత ఉపశమనం కలిగించిన వారిమవుతాము.



కిడ్నీ ఆరోగ్యానికి... వెజ్ ఫుడ్స్ !



మన శరీరంలో ముఖ్యమైన అవయవాల్లో కిడ్నీ(మూత్ర పిండాలు)లు ప్రాధానమైనవి. ఇవి నిరంతరం రక్తంలోని వ్యర్థాలను వడకడుతూ.. మన శరీరంలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుంటాయి. వీటిని జాగ్రత్తగా కాపాడుకోవడం ప్రాణావసరం. ఒకసారి మూత్రపిండం పనితీరు మందగించి అది విఫలమవటం ఆరంభమైందంటే దాన్ని పూర్తిగా నయం చేయటం కష్టం. పైగా చికిత్సకు ఎంతో ఖర్చు అవుతుంది. మూత్రపిండం పూర్తిగా విఫలమైతే కృత్రిమంగా రక్తాన్ని శుద్ధి చేసుకుంటూ ఉండక తప్పదు. ఈ డయాలసిస్' కోసం నెలకు సుమారు రూ.4-5వేలు ఖర్చు అవుతాయి. అంతేకాకుండా ఇతర్రతా సమస్యలు ఏర్పడతాయి. చికిత్స తీసుకున్నా కిడ్నీ తిరిగి సమర్ధంగా మారదు. గుండె జబ్బులు, అవయవాలు దెబ్బతినటం వంటివీ మొదలవుతాయి. పోనీ దెబ్బతిన్న మూత్రపిండాన్ని మార్పిడి చేయించుకోవాలంటే కిడ్నీ దాతలు దొరకటం కష్టం. ఆపరేషన్ పెద్ద ప్రయత్నమనుకుంటే ఇక ఆ రత్వాత జీవితాంతం వేసుకోవాల్సిన మందులకూ ఖర్చు చాలా ఎక్కువ అవుతుంది. ఎన్నో ఇబ్బందులు, దుష్ప్రభావాలు. ఇంత ఖర్చు చేసి చికిత్స తీసుకున్నా జీవనకాలమూ తగ్గవచ్చు. ఇలాంటి ప్రమాదాలన్నీ దరిచేరకుండా ఉండాలంటే ముందే మేల్కొని, అసలు కిడ్నీలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవటం మంచిది. శరీరం మొత్తాన్నీ శుచిగా, శుద్ధిగా ఉంచే సహజసిద్ధ యంత్రాలు కిడ్నీలు. అవి ఒక్కసారి పనిచేయమని మొరాయిస్తే.. ఆరోగ్యం అస్తవ్యస్తం అయిపోతుంది. అంతటి ప్రాముఖ్యం ఉన్న కిడ్నీలను కాపాడుకోవాలంటే ముందు జీవనశైలి ఆరోగ్యంగా ఉండాలి. జీవన శైలి ఆరోగ్యంగా ఉండాలంటే అందుకు మంచి ఆహారం తీసుకోవాలి. కిడ్నీకు ఉపయోగపడే కొన్ని ఆహారాలను తరచూ తీసుకోవడం వల్ల కడ్నీ సమస్యలను అరకట్టవచ్చు. కిడ్నీలో రాళ్ళు ఏర్పడటం, కిడ్నీ ఇన్ఫెక్షన్ వంటి వాటికి దూరంగా ఉండొచ్చు. కిడ్నీని పదిలంగా ఉంచే కొన్ని ఆహారాలు మీ కోసం...

క్యాబేజ్: క్యాబేజ్ లో పొటాషియం మరియు విటమిన్ కె అధికంగా ఉంటుంది. క్యాబేజ్ మూత్ర పిండాల పనితీరును మెరుగుపరుస్తుంది. సాధారణంగా క్యాబేజ్ ను మూత్రపిండాల డ్యామేజ్ ను అరికట్టడానికి మరియు మూత్రపిండాల పోషణకు ఒక మంచి సహజ ఔషధంగా ఉపయోగిస్తారు.

రెడ్ గ్రేప్: ఇది కిడ్నీ హెల్తీ ఫుడ్. అందువల్లే దీన్ని మీ డైలీ డైయట్ లో ఖచ్చింతా చేర్చుకోవాలి. రెడ్ గ్రేప్స్ లో అధికంగా ఫ్లవనాయిడ్స్ కలిగి ఉండి, బ్లడ్ కాట్స్ ను తగ్గిస్తాయి. రెడ్ గ్రేప్స్ తరచూ తీసుకోవడం వల్ల గుండె మరియు కిడ్నీ సంబంధిత వ్యాధులను తగ్గించే అవకాశాలు ఎక్కువ. రెడ్ గ్రేప్ శరీరాన్ని డిటాక్స్ చేయడానికి మరియు క్లీన్ చేయడానికి బాగా సహాయపడుతాయి.

స్ట్రాబెర్రీస్: రంగు రంగుల బెర్రీలు కిడ్నీలకు చాలా మంచిది. స్ట్రాబెర్రీ, రస్ బెర్రీ, బ్లూ బెర్రీ, క్రాన్ బెర్రీ ఏదైనా సరే మంచివే. యాంటీ ఆక్సిడెంట్లు, మెగ్నీషియం, విటమిన్ సి మరియు ఫైబర్ పుష్కలంగా ఉండే బెర్రీలు కిడ్రీ ఆరోగ్యానికి మాత్రమే కాదు కేన్సర్ కూడా మంచి ఔషధంగా పనిచేస్తాయి. వీటిలో బ్లాక్‌బెర్రీ తప్పించి మిగిలినవన్నీ తినతగినవే. స్ట్రాబెర్రీ, క్రాన్ బెర్రీస్, రాస్బెరీస్ మరియు బ్లూబెర్రీస్ అన్నింటిలోనూ కిడ్నీ ఫ్రెండ్లీ న్యూట్రీషియన్స్ మరియు యాంటీఇన్ ఫ్లమేటరి గుణాలు పుష్కలంగా ఉండి, వ్యాధి నిరోధకతను కలిగించి బ్లాడర్ ఫంక్షన్స్ సక్రమంగా పనిచేసేందుకు సహాయపడుతాయి.

పార్సే (Parsley) : వెజిటేరియన్స్ తప్పనిసరిగా తీసుకోవల్సిన ఆహారాల్లో ఇది ఒక ప్రధానమైన ఆహారం. ఇది కిడ్నీ ఆరోగ్యానికి మాత్రమే కాదు, మొత్తం శరీర ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. ఈ గ్రీన్ లీఫీ వెజిటేబుల్ ను కిడ్నీ స్టోన్ నివారించడంలో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఇది కిడ్నీలను శుభ్రం చేసి మరియు శుద్ధం చేస్తుంది.

కాలీఫ్లవర్: కిడ్నీలకు ఆరోగ్యకరమైన ఆహారం కాలీఫ్లవర్. కాలీఫ్లవర్ లో విటమిన్ సి పుష్కలం మరియు లో పొటాషియం కలిగి ఉంటుంది. అందువల్లే ఇది కిడ్నీ ఆరోగ్యానికి చాలా మంచిది. ఇది కిడ్నీలను శుభ్రం చేసి, డిటాక్సిఫై చేస్తుంది.

ఆపిల్స్: ఆపిల్స్ ఆరోగ్యానికి చాలా మంచివి. ఇది జీర్ణక్రియకు బాగా సహాయపడుతాయి. మరియు అతి సులభంగా జీర్ణం అవుతాయి. వీటిలో ఫైబర్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి పూర్తి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇవి మూత్రపిండాలు నిర్విషీకరణం మరియు శుభ్రపరచడానికి బాగా సహాయపడుతాయి. మీరు డాక్టర్ కు దూరంగా ఉండాలంటే ప్రతి రోజూ ఒక ఆపిల్ తినడం మంచిది!

బ్లూ బెర్రీస్: కిడ్నీలను శుభ్రపరిచి మరియు శుద్ధి చేయు యాంటీ ఆక్సిడెంట్స్ మరియు యాంథోసైయనీడిన్స్

అల్లం: అల్లంలో యాంటీఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. అల్లం మన శరీరంలోని రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తూ రక్తపోటును తగ్గిస్తుంది. అల్లం మన శరీరంలోని కండరాలని మెతక చేసి రక్తనాలాలని కండరాల ఒత్తిడినుండి విడిపిస్తుంది. అల్లంను పచ్చిగా తీసుకున్నా లేదా ఉడికించి తీసుకున్నా కిడ్నీలకు చాలా ఆరోగ్యంకరం. ఇది కిడ్నీలను శుభ్రపరుచుటలో, రక్తం శుద్దిచేయడంలో బాగా పనిచేస్తుంది. ముఖ్యంగా ఇది మధు మేహగ్రస్తులకు మరింత ఆరోగ్యకరం. వారి కిడ్నీలను ఆరోగ్యంగా ఉండేలా కాపాడుతుంది. కాబట్టి మూత్రపిండాల మొక్క ఆరోగ్యం కోసం ప్రతి రోజూ అల్లం చిన్న ముక్కను లేదా అల్లం రసంను సేవించడం మంచిది.

రాస్పెరీస్: రాస్పెరీస్ లో అలెర్జిక్ యాసిడ్ పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలోని ఫ్రీరాడికల్స్ ను తొలగించడంలో బాగా సహాయపడుతుంది.

క్రాన్ బెర్రీస్: చెర్రీస్ లో అధికంగా విటమిన్స్ మరియు లోప్రోటీన్స్ కలిగి ఉంటాయి. చెర్రీస్ ను తరచూ తీసుకోవడం వల్ల శరీరంలోని పొటాషియం లెవల్స్ ను తగ్గించేదుకు సహాయపడుతుంది. దాంతో కిడ్నీ ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడుతుంది. మరియు యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్ ను నివారిస్తుంది.

రెడ్ బెల్ పెప్పర్: చాలా మంది వారికి తెలిసి మరియు తెలికుండానే కిడ్నీ వ్యాధులకు గురిఅవుతుంటారు. కిడ్నీ సంబంధిత వ్యాధుల నుండి రక్షణ పొందడానికి ఈ సూర్ ఫుడ్ ను మీ డైలీ డైయట్ లో చేర్చుకోవాలి. రెడ్ బెల్ పెప్పర్ లో పొటాషియం తక్కువగా ఉండి విటమిన్స్ (ఎ, సి మరియు బి6), ఫోలిక్ యాసిడ్ మరియు ఫైబర్ ఉండటం వల్ల కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. అంతే కాదు కొన్ని క్యాన్సర్ల ను ఎదుర్కొంటుంది.

పెరుగు: మన నిత్యజీవితంలో భాగమే అయినా కొందరు పెరుగు అవసరాన్ని గుర్తించరు. ప్రోటీన్లు, కేల్షియంలను అందిస్తూ, జీర్ణవ్యవస్థను సక్రమంగా ఉంచే పెరుగు ఆరోగ్యాన్ని సదా కాపాడటంలో ముందుంటుంది. బలమైన, చక్కని ఆరోగ్యానికి పెరుగు దివ్యమైనది. పెరుగులో కాల్షియం పుష్కలంగా లభిస్తుంది.పెరుగు రక్తంలోని కొలెస్టరాల్ శాతాన్ని తగ్గిస్తుంది. ఫంగస్ శరీరంలో చేరకుండా నివారిస్తుంది.

ఆలివ్ ఆయిల్: వివిధ రకాల ఆయిల్స్ లో ఆలివ్ ఆయిల్ ఆరోగ్యానికి మరియు గుండెకు ఎంత మేలు చేస్తుందో మనందరికీ తెలుసిన విషయమే. ఆలివ్ ఆయిల్ లో యాంటీఇన్ ఫ్లమేటరీ ఫాటీ యాసిడ్స్ కలిగి ఉండి కిడ్నీ ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడుతాయి. ఎగ్ వైట్ - ఎగ్ వైట్ లో అమినోయాసిడ్స్ మరియు లోఫాస్పరస్ అధికంగా కలిగి ఉంటాయి. గుడ్డులో తెల్లగా వుండే భాగం లో వుండే ఎమినో యాసిడ్లు కిడ్నీకి చాలా మంచిది. తెల్లటి భాగం మాత్రమే తినండి. అందుకే వీటిని కిడ్నీఆరోగ్యంగా ఉంచే ఆహారాల్లో దీన్ని కూడా సూపర్ ఫుడ్ గా లెకిస్తారు.

గుమ్మడి విత్తనాలు: గుమ్మడి విత్తనాలు గుమ్మడి విత్తనాలు, కిడ్నీలకు చాలా మంచి ఆహారం. కిడ్నీకి బలాన్ని ఇవ్వడమే కాక రక్త పుష్టిని కలిగిస్తుంది. : గుమ్మడి విత్తనాలు, కిడ్నీలకు చాలా మంచి ఆహారం. కిడ్నీకి బలాన్ని ఇవ్వడమే కాక రక్త పుష్టిని కలిగిస్తుంది. కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచేదుకు ఉపయోగపడే యాంటీఆక్సిడెంట్స్, మినరల్స్, విటమిన్స్ ఇందులో పుష్కలంగా ఉన్నాయి. వీటిలో మెగ్నీషియం మెండుగా వుంది. ఇంకా మినరల్స్ అత్యధికంగా పోగుపడ్డ గింజలు. అంతేకాదు వీటికి ఆహారంలో భాగస్వామ్యం కల్పిస్తే మన జీవితకాలం మరింత పెరుగుతుందట!

పోషకాల రేడు నేరేడు

ప్రస్తుతం మార్కెట్లో ఎక్కడ చూసినా కరర్ ఫుల్‌గా నేరేడు పండ్లతో కళకళ లాడుతున్నది. వర్షాకాలం మొదలైతే చాలు..నేరుడు పండ్ల సీజన్ ప్రారంభ మవుతుంది. ప్రతి సీజన్‌లోనూ ఆ సీజన్‌కు మాత్రమే పరిమితమైన కొనని పండ్లు, పువ్వులు లభిస్తుంటాయి. అలా వర్షా కాలంలో నేచర్ మనుకు గిఫ్ట్‌గా ఇచ్చిన అమేజింగ్ అండ్ హెల్తీ ఫ్రూట్స్‌లో నేరేడుపండు ఒకటి. చూడటానికి నల్లగా, నిగనిగలాడుతూ ద్రాక్ష పండ్లలా నోరూరిస్తుండే నేరుడు పండ్లు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. నేరేడు పండ్లు పిల్లలకు మాత్రమే కాదు, పెద్దలందరికీ కూడా చాలా అరోగ్యకరం. నేరేడు పండ్లలో పోషకాలు మెండుగా ఉంటాయి. కేవలం పండే కాదు, నేరేడు చెట్టు ఆకులు, గింజలు, బెరడు..ఇలా అన్నీ ఆరోగ్యానికి మేలు చేసేవే. నేరేడు మధుమేహం, క్యాన్సర్ వంటి వివిధ ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపుతుంది. ఇంతటి ప్రత్యేకత ఉన్న నేరేడులో ఉండే ఇతర పోషక విలువలేమిటో ? అవి ఆరోగ్యానికి ఏవిధంగా మేలు చేస్తాయో తెలుసుకుందాం...

ఆరోగ్యానికి సరిజోడు: నేరేడు ప్రయోజనాల గురించి తెలుసుకునే ముందు బాగా పండిన నేరేడు పండులో గ్లూకోజ్, ఫ్రక్టోజ్ పుష్కలంగా లభిస్తాయి. ఇతర పండ్లతో పోల్చి చూస్తే మినరల్స్ అధికంగా, క్యాలరీలు తక్కువగా ఉంటాయి. కాబట్టి, దీన్ని తినడం వల్ల బరువు పెరుగుతామన్న దిగులు కూడా ఉండదు. నేరేడు గింజల నుండి కూడా అధిక సంఖ్యలో ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొద్ది మొత్తంలో క్యాల్షియం, విటమిన్ బి, సి, ఐరన్ లు కూడా లభిస్తాయి. ప్రతి వంద గ్రాముల నేరేడు పండ్లలో రెండు మిల్లీగ్రాముల ఐరన్ ఉంటుంది. శరీరానికి రోజుకి కావల్సిన విటమిన్ సి నలభై% మిల్లీగ్రాములె%తే.. వందగ్రాముల నేరేడులో 18 మిల్లీగ్రాముల దాకా ఉంటుంది. కెరోటిన్, ఫైటోకెమికల్స్ (యాంటీఆక్సిడెంట్లు), మెగ్నీషియం, పొటాసియం, పీచుపదార్థాలు, మొద లైన పోషకాలన్నీ కూడా నేరేడు నుంచి మనకు లభిస్తాయి.

ఆకుల్లోనూ యాంటీ బ్యాక్టీరియా:

అలాగే నేరేడు చెట్టుకు ఆకుల్లో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు దంతాలను స్ట్రాంగ్ గా ఉంచడంతో పాటు చిగుళ్ల సమస్యలను తగ్గించ డంలో కీలక పాత్ర పోషిస్తాయి. లివర్ సమస్యలను మెరుగు పరుస్తుంది: నేరేడు పండులో ఉండే గుణాలు కాలేయం యొక్క పనితీరును మెరుగుపరుస్తుంది. ఈ పండులో ఉండే నేచురల్ ఆమ్లాలు జీర్ణశక్తిని పెంచడంలో గ్రేట్‌గా సహాయ పడుతాయి.

కోరింత దగ్గు నివారిస్తుంది: వర్షాకాలంలో జలుబు, దగ్గు..వంటి ఆరోగ్య సమస్యలు రావడం సహజం. నేరేడు కూడా వర్షాకాలంలో లభించే పండు కాబట్టి, వీటిని తినడం వల్ల జలుబు, కోరింత దగ్గు, దీర్ఘకాలంగా వేధించే దగ్గు, ఆస్తమా..లాంటి సమస్యలను నుంచి విముక్తి పొందవచ్చు. అంతేకాదు పైల్స్ నివారణకూ తోడ్పడుతుంది. ఈ సీజన్‌లో నేరేడు పండును రోజూ ఉదయం ఉప్పుతో పాటు తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మంచిది. పైల్స్ సమస్యతో బాధపడుతున్న వారు నేరేడు పండును తేనెతో పాటు తీసుకుంటే మంచిది.

ఇమ్యూనిటి పెంచుతుంది: వర్షాకాలంలో వచ్చే వివిధ జబ్బుల నుండి శరీర ఆరోగ్యాన్ని కాపాడుకొనే శక్తిని నేరేడు అందిస్తుంది. క్యాన్సర్ నివారిణినిగానూ పనిచేస్తుంది. నేరేడులో ఉండే బయోయాక్టివ్ ఫోటో కెమికల్స్, పాలిఫినోల్స్ క్యాన్సర్ రాకుండా నివారిస్తాయి. కీమోథెరఫీ వంటి క్యాన్సర్ చికిత్సలు చేయించుకునే సమయంలో నేరేడు పండ్లను ఆహారంగా తీసుకోవటం వల్ల చక్కటి ప్రయోజనం ఉంటుంది. క్యాన్సర్ రాకుండా రక్షస్తుంది.

డయాబెటిస్ కంట్రోల్ చేస్తుంది: డయాబెటిస్‌ను అదుపులో ఉంచడానికి ఆయుర్వేద మందుల్లో నేరేడు పండు గింజల్ని వాడతారు. అంతేకాదు డయోరియాతో బాధపడేవారికి నేరేడు చక్కటి పరిష్కార మార్గం. నేరేడు పండ్ల గింజలను పొడిగా చేసుకునిమజ్జిగలో కలుపుకుని తాగితే సమస్య నుంచి బయటపడొచ్చు. నేరేడు చెట్టు బెరడును మెత్తగా నూరి కాషాయంలా తయారుచేసుకుని దానిలో తేనె కలుపుకుని తీసుకున్నా డయేరియా నుంచి త్వరగా ఉపశమనం పొందవచ్చు.

వేడినీటి స్నానం ఎక్సర్‌సైజుతో సమానం



లండన్: రోజంతా పనిచేసి అలసిపోయి ఇంటికి రాగానే వేడి నీటితో స్నానం చేస్తే ఎంతో హాయిగా ఉంటుంది. అలసట నుంచి శరీరం, ఒత్తిడి నుంచి మనసు ఉపశమనం పొందుతుంది. ఇవన్నీ మనకు తెలిసిన విషయాలే. కానీ వేడినీటితో స్నాన్నం.. చిన్నపాటి ఎక్సర్‌సైజుతో సమానమని చెబుతున్నారు శాస్త్రవేత్తలు. అంతేకాదు.. ప్రతిరోజూ వేడినీటితో స్నానం చేయడం వల్ల గుండె సంబంధిత సమస్యల బారిన పడకుండా ఉంటామని, రక్తపోటు, మధుమేహం వంటివి కూడా తగ్గుతాయంటున్నారు.

2,300 మందిపై పరిశోధన చేసి ఈ నిర్ణయానికి వచ్చారు. పరిశోధన కోసం ఎంపికచేసిన వారితో 30 నిమిషాలు బ్రిస్క్‌వాక్ చేయించారు. దీంతో వారిలో 140 కేలరీలు ఖర్చయినట్లు గుర్తించారు. ఆ తర్వాత వేడినీటితో సంపూర్ణ స్నానం చేయమన్నారు.

ఈసారి కూడా 140 కేలరీలు ఖర్చయినట్లు గుర్తించారు. అంటే ఓ వేడి నీటి స్నానం.. 30 నిమిషాల బ్రిస్క్ వాకింగ్‌తో సమానమని తేల్చారు. అయితే అరగంట సైక్లింగ్ చేస్తే 630 కేలరీలు ఖర్చవుతాయని, వేడి నీటి స్నానంతో ఇంత పెద్దమొత్తంలో కేలరీలు ఖర్చు కాలేవని గుర్తించారు.

జయ జానకి నాయక

రివ్యూ

[redacted]

కథేంటంటే: గగన్(బెల్లంకొండ శ్రీనివాస్)కు కుటుంబం అంటే చాలా ఇష్టం. నాన్న చక్రవర్తి (శరత్‌కుమార్) అన్నయ్య(నందు)లంటే అతనికి ప్రాణం. గగన్‌కు స్వీటీ(రకుల్‌ప్రీత్‌సింగ్) పరిచయం అవుతుంది. ఆమె రాకతో చక్రవర్తి ఇంటి స్వరూపమే మారిపోతుంది. స్వీటీ-గగన్ ప్రేమించుకుంటారు. అయితే స్వీటీ జీవితంలో అనుకోని ఓ సంఘటన ఎదురవుతుంది. అప్పటి వరకూ సీతాకోకచిలుకలా ఎగిరిన ఆమె.. ఒక్కసారిగా పంజరంలో పావురం అవుతుంది. అలాంటి స్వీటీని రక్షించడానికి గగన్ కుటుంబం ఏం చేసింది? అశ్వింత్ నారాయణ (జగపతిబాబు)కీ, స్వీటీకి ఉన్న సంబంధం ఏమిటి? తదితర విషయాలు తెరమీద చూడాలి.

ఎలా ఉందంటే: ఇదో ప్రేమ కథ. ప్రేమించిన అమ్మాయి కోసం ఓ యువకుడు ఏం చేశాడు? ఎవరిపై పోరాటం చేశాడు? అనే ఇతివృత్తంతో సాగుతుంది. ఆ కథ చుట్టూనే యాక్షన్ ఎమోషన్ సన్నివేశాలను అల్లుకున్నాడు దర్శకుడు. బోయపాటి శ్రీను ప్రధాన బలం యాక్షన్. అతను ఏ కథ ఎంచుకున్నా యాక్షన్.. మాస్ మసాలా బాగా దట్టిస్తాడు. ఈసారి అదే దారిలో నడిచాడు. సినిమా ప్రారంభం నుంచే ఓ ఎమోషన్ డ్రైవ్‌తో సాగుతుంది. యాక్షన్ ఘట్టాలు, వాటి ముందు వచ్చే లీడ్ సన్నివేశాలను దర్శకుడు బాగా రాసుకున్నాడు. దాంతో మాస్ ప్రేక్షకులకు ఆయా సన్నివేశాలు నచ్చుతాయి. పరువు-పంతం వీటి నడుమ ఓ అమ్మాయి ఎలా నలిగిపోయింది అనే విషయాన్ని దర్శకుడు సమర్థంగా తెరకెక్కించగలిగాడు. హంసలదీవిలో తెరకెక్కించిన యాక్షన్ ఎపిసోడ్ సినిమా మొత్తానికి హైలైట్‌గా నిలుస్తుంది. శరత్‌కుమార్ ఉన్న సన్నివేశాలు కుటుంబ ప్రేక్షకులకు నచ్చుతాయి. ఇదో ప్రేమకథ అయినప్పటికీ నాయకనాయికల మధ్య రొమాన్స్ కంటే హీరో-విలన్ల మధ్య ఎమోషన్‌కు దర్శకుడు పెద్ద పీట వేయడం గమనార్హం. లెక్కకు మించిన యాక్షన్ సన్నివేశాలతో తెరపై అధిక భాగం ఫైట్లకే పరిమితం చేసినా, దాని చుట్టూ ఎమోషన్ సన్నివేశాలు ప్రేక్షకుడిని కదలకుండా చేస్తాయి.

ఎవరెలా చేశారంటే: బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కు ఇది మూడో సినిమా. అతని బలాలు, బలహీనతలు బోయపాటి బాగా గమనించాడు. అందుకు తగినట్టుగానే సన్నివేశాలు రాసుకున్నాడు. యాక్షన్, నృత్య సన్నివేశాల్లో శ్రీనివాస్ ప్రతిభ కనిపిస్తుంది. క్లైమాక్స్‌లో ఎమోషనల్ డ్కెలాగ్‌లు బాగా పలికాడు. రకుల్ పాత్ర రెండు కోణాల్లో సాగుతుంది. తొలి సగం ఓ సాధారణ అమ్మాయిగా కనిపించిన ఆమె.. ద్వితీయార్ధంలో పీకల్లోతు కష్టాల్లో ఉన్న అమ్మాయిగా, నటనకు ఆస్కారం ఉన్న పాత్రలో ఆకట్టుకుంది. జగపతిబాబు ఈ చిత్రంలో మరింత స్టైలిష్‌గా కనిపించారు. ఆయన వచ్చే ఆరంభ సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. నందూకి కూడా మంచి పాత్రే దక్కింది. శరత్‌కుమార్ నటన, ఆయన చుట్టూ నడిపించిన సన్నివేశాలు అలరిస్తాయి. చాలా కాలం తర్వాత వాణీ విశ్వనాథ్ తెరపై కనిపించారు. అయితే ఆ పాత్రకు ప్రాధాన్యం దక్కలేదు.

సాంకేతికంగా..: చిత్రంలో అడుగడుగునా భారీతనం, నిర్మాణ విలువలు కనిపిస్తాయి. చిన్న పాత్రలోనూ గుర్తింపు ఉన్న నటుడే కనిస్తాడు. దేవిశ్రీ ప్రసాద్ నేపథ్య సంగీతం బాగుంది. 'వీడే వీడే' అనే పాటలో సాహిత్యం ఆకట్టుకుంటుంది.

రిషీ పంజాబీ కెమెరా పనితనం మరో ప్రధాన ఆకర్షణ. కేథరిన్ ఐటమ్ సాంగ్ బాగున్నా, ఇరికించినట్టు అనిపిస్తుంది. బోయపాటి శ్రీను తనదైన మార్కు చూపించాడు. కథా, కథనాల్లో మలుపులు ఉన్నా అవి సమర్థంగా తెరపై చూపించకపోవడం కొంత లోపంగా చెప్పుకోవచ్చు.

'నేనే రాజు నేనే మంత్రి'

పబ్లిక్ టాక్



తేజ దర్శకత్వంలో తెరకెక్కిన 'నేనే రాజు నేనే మంత్రి' మూవీ గ్రాండ్ గా రిలీజైంది. ఇప్పటికే ఇండియాతో పాటు విదేశాల్లో పలు చోట్ల ప్రీమియర్ షోలు వేశారు. రానా, కాజల్ హీరో హీరోయిన్లుగా కేథరిన్, నవదీప్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ చిత్రానికి ఆడియన్స్ నుండి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది అవ మీ టికెట్స్ ను వెంటనే బుక్ చేసుకోండి! పొలిటికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో హీరో హీరోయిన్ల మధ్య జరిగే లవ్ స్టోరీ కూడా సినిమాకు ప్రధాన బలంగా నిలిచిందరి అంటున్నారు. ఆడియన్స్ నుండి వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే సినిమా హిట్ కావడం ఖాయం అంటున్నారు ట్రేడ్ విశ్లేషకులు. జోగేంద్ర (రానా దగ్గుబాటి) విలేజ్‌లో వడ్డీవ్యాపారం చేసే యువకుడు. తన గ్రామంలో సర్పంచ్ గా పోటీ చేస్తాడు. కొన్ని రాజకీయ పరిణామాల వల్ల జోగేంద్ర సీఎం తనికెళ్ల భరణి కేబినెట్‌లొ మంత్రి అవుతాడు. తనకు ఎదురైన కొన్ని సంఘటనలతో తానే సీఎం అవ్వాలని ప్రయత్నిస్తాడు. అయితే పార్టీలోని పరిస్థితులు అందుకు సహకరించక పోవడంతో తన పదవికి రాజీనామా చేసి ఇండిపెండెంట్ క్యాండిడేట్‌గా చేస్తాడు. ఆ తర్వాత జరిగిన పరిణామాలు ఏమిటి? అనేది తర్వాతి స్టోరీ... నేనే రాజు నేనే మంత్రి మూవీలో రానా పెరాఫర్మెన్స్ సినిమాకు మెయిన్ హైలెట్. కాజల్ అందంతో మెప్పించింది. రానా, కాజల్ మధ్య కెమిస్ట్రీ బాగా వర్కౌట్ అయింది. కేథరిన్, నవదీప్, అశుతోష్ రానా, శివాజీ రాజా, తనికెళ్ల భరణి, అజయ్, ప్రదీప్ రావత్ తమ తమ పాత్రలకు న్యాయం చేశారు. నేనే రాజు నేనే మంత్రి మూవీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ బావున్నాయి. బ్యాగ్రౌండ్ స్కోర్, సినిమా పిక్చరైజేషన్, యాక్షన్ సీన్లు, పంచ్ డైలాగులు ఇలా అన్ని టెక్నికల్ విభాగాలు ప్రేక్షకులను మెప్పించాయి. సినిమాపై ఆడియన్స్ ట్విట్టర్ ద్వారా వెల్లడించిన అభిప్రాయాల ప్రకారం ఫస్టాఫ్ చాలా బావుంది. అయితే సెకండాఫ్ లో ఓవర్ డోస్ సెంటిమెంట్ ప్రేక్షకుల సహనాన్ని పరీక్షిస్తాయని తెలుస్తోంది.



అబద్ధం ఆడితే అతికినట్టుండాలి కానీ....!

"లై" రివ్యూ

నితిన్... దాదాపు ఏ తెలుగు హీరోకీ రానంత క్రైసిస్ ని ఎదుర్కొని కూడా తానేమిటో నిరూపించుకున్న యువ నటుడు. అతని వయస్సులో కెరీర్ పూర్తిగా సెట్ కాకముందే నితిన్ కి ఎదురైన ఫ్లాప్ లు మామూలువి కాదు. దాదాపు నితిన్ పని ఇక అయిపోయిందీ అనుకున్న టైం లో మళ్ళీ లేచి నిలబడ్డాడు. టాలీవుడ్ కి కావాల్సిన నటన అనే "స్టఫ్" తో మళ్ళీ ఎదిగాడు. ఒక్కొక్క సినిమానీ ఎటువంటి పెద్ద అంచనాలు లేకుండానే రిలీజ్ తర్వాత సైలెంట్ హిట్ అన్న టాక్ తో తన స్టామినా తో సినిమాని నడిపించగల స్థాయి కి ఎదిగాడు. అయితే ఈసారి మళ్ళీ స్టైలిష్ లుక్ తో వచ్చి "యావరేజ్ కంటే తక్కువే" అనిపించుకునేలా తయారయ్యాడు. సారీ...! సినిమాని హను రాఘవపూడితో కలిసి అలా తయారు చేసాడు... చాలా అంచనాలతో వచ్చింది "లై" ఇదివరకు ఎన్నడూ లేనంత స్టైలిష్ లుక్ తో నితిన్, స్ట్రైట్ సినిమాలో విలన్ గా చేసిన నిన్నటితరం యాక్షన్ కింగ్ అర్జున్, టాలీవుడ్ లో ఒక డిఫరెంట్ ఫీల్ ఉండే సినిమా అందాల రాక్షసీ, నానీ కెరీర్ లోనే గుర్తుండిపోయే సినిమా "కృష?గాడి వీర ప్రేమ గాథ" లాంటి సినిమాలని తీసిన హను రాఘవపూడి దర్శకత్వం.... ఇవన్నీ ఉంటే ప్రేక్షకుడు ఎంత ఎక్సైట్ చెస్తాడు...? మరి ప్రేక్షకుడు కొరుకున్నది దొరికిందా? లై "నిజంగా" ఎంత ఆకట్టుకోగలిగిందీ అన్నది ఇప్పుడు చూద్దాం... అబద్ధాల మీద మాత్రమే బతకగలం అని చిన్నతనం నుంచే మైండ్ ని ఫిక్స్ చేసుకున్న ఒక అబ్బాయి జీవితం మొత్తం అబద్ధాలతో నింపేసుకుంటాడు సత్యం (నితిన్) పేరు మాత్రమే సత్యం కానీ ఎప్పుడూ నిజం చెప్పడు. ఎలాంటి భాధ్యతలు లేని కుర్రాడు. పెద్దింటి అమ్మాయిని పెళ్లాడాలనే ఆలోచనతో ఉన్న సత్యానికి చైత్ర (మేఘా ఆకాష్) పరిచయం అవుతుంది. ఒక విచిత్రమైన కారణం (చెప్తే క్యామిడీకంటే ఎక్కువ నవ్వుతారు) తో పెళ్ళి క్యాన్సిల్ చేసుకున్న చైత్ర పిల్ల మన సత్యం తో కలిసి యూఎస్ ట్రిప్ కి బయల్దేరుతుంది. పాపం అబద్ధాలే కాకుండా మనోడు మాంచి స్టైలిష్ గా కూడా కనిపించటం తో ఎంచక్కా ఇద్దరు ఒకరికి ఒకరు అబద్ధాలు చెప్పుకుంటూ ప్రేమలో పడతారు. ఇంతా ప్రేమ లోపడ్డాక విలన్ కూడా

"ఉండాలికాబట్టి" ఇక వీరిమధ్యన విలన్ పద్మనాభం (అర్జున్) వస్తాడు. ఇక అంతలోనే ఇంతలోనే స్టోరీలో ఊహించని ట్విస్ట్ (నిజానికి ఇది ఊహించగలిగే ట్విస్టే) వచ్చేసి సినిమాని మలుపు తిప్పేసి పోతుంది. అనాధగా పెరిగి లైఫ్ మీద పెద్దగా ఫోకస్ లేని ఇతను ఆ అమ్మాయి కారణంగా ఒక ఇబ్బంది లో ఇరుక్కుని ఇంటర్వెల్ లో తానేంటో , అతని కుటుంబం ఏంటో తెలుసుకుంటాడు. ఇక్కడ ఒక అదుతేమైన ట్విస్ట్ తో ఇంటర్వెల్ బ్యాంగ్ వస్తుంది. ఇక సత్యం ఆ మలుపులు తురుగుతూ ఫైటింగులు చేస్తూ క్లైమాక్స్ దాకా వెళ్ళిపోతాడు..? అసలు ఈ విలన్ ఎవరు..? ఆ పద్మనాభానికీ ఈ అబద్ధాల సత్యానికీ ఎందుకు గొడవొచ్చిందీ,? వీరి మధ్య ఏం జరిగింది అన్నది అసలు కథ. నిజానికి ఇంకాస్త శ్రద్ధ తీసుకుంటే బాక్సులు పేలిపోయే కథే ఇది.... ఇప్పటి వరకూ మనం చూసిన నితిన్ ఒకటైతే లై లో కనిపించే అసత్యాల "సత్యం" ఒకెత్తు. స్టైలిష్ లుక్ లోనూ, బాడీ లాంగ్వేజ్ లోనూ విపరీతమైన ఈజ్ కనబరిచాడు, ఇక ఫైట్స్ లో ఇరగదీసాడనే చెప్పుకోవాలి యావరేజ్ గా మొత్తం సినిమా సక్సెస్ లో భాగం ఇవ్వాల్సి వస్తే 50% ఒక్క నితిన్ కే ఇవ్వొచ్చు (ఈ సినిమా వరకూ), ఇక ఇంకో అట్రాక్షన్ నిన్నటి తరం యాక్షన్ కింగ్ అర్జున్ అటు కోలీవుడ్ లోనూ ఇటు టాలీవుడ్ లోనూ హీరోగా రాణించి ఇప్పటికీ ఇంకా హీరోగా నటిస్తున్న అర్జున్ ఈ సినిమాలో పూర్తి విలన్ గా కనిపించి మెప్పించాడు. నిజానికి నితిన్ నటన ఎక్కువగా నచ్చటానికి అర్జున్ ని మించి పెరాఫర్మెన్స్ చూపించాలన్న తపన అనికూడా అనుకోవచ్చు.



నేరెళ్ల ఘటనపై సీబీఐ విచారణ జరిపించాలి

మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలి

సుప్రీంకోర్టులో పోరాడుతాం

రాష్ట్ర ప్రజా సంఘాల ఐకాస ఛైర్మన్ గజ్జెల కాంతం

వేములవాడ: నేరెళ్ల ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐతో విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రజాసంఘాల ఐకాస ఛైర్మన్ గజ్జెల కాంతం డిమాండ్ చేశారు. వేములవాడలో చికిత్స పొందుతున్న నేరెళ్ల బాధితులను ఆయన పరామర్శించారు. వారితో మాట్లాడిన అనంతరం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీ పని చేసుకుంటూ బతుకుతున్న సామాన్య దళితులను, బీసీలను జిల్లా ఎస్పీ విశ్వజిత్ కులం పేరుతో దూషిస్తూ పోలీసులు ఇష్టారాజ్యంగా చిత్రహింసలు పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్నారు. వారు చనిపోతారని భావించిన పోలీసులు జైల్‌కు పంపారని ఆరోపించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో ఇసుక మాఫియాకు 43 మంది చనిపోతే స్పందించని ప్రభుత్వం, ఇసుక లారీ దహనమైతే స్పందించి అక్రమంగా కేసులు పెట్టారన్నారు. నేరెళ్ల ఘటనపై సుప్రీంకోర్టుకు వెళ్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకం లేదన్నారు. సీబీఐతో సామాన్యులకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. బహిరంగ సభ కోసం అనుమతులు ఇవ్వడం లేదన్నారు. బాధితులను పరామర్శించిన కేటీఆర్‌కు నెల పది రోజుల తర్వాత ఘటన వివరాలు తెలిసి పరామర్శకు వచ్చానని బాధితులతో మంత్రి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తన నియోజకవర్గంలో ఏం జరుగుతుందో తెలియని మంత్రి భేషరుతుగా రాజీనామా చేయాలన్నారు. సిరిసిల్ల ప్రజలు ఓటేస్తేనే కేటీఆర్ మంత్రి అయ్యారని, మంత్రి కేటీఆర్‌కు ప్రజలపై ప్రేమలేదన్నారు. తెలంగాణ ప్రజలను చంపెయ్యడం, అక్రమ కేసులు పెట్టేందుకు దృష్టి పెట్టారని ప్రజలపైన దృష్టి పెట్టలేదని విమర్శించారు. నేరెళ్ల ఘటన జరిగాక మంత్రి మూడు సార్లు సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించారని బాధితులను మాత్రం పలకరించకపోవడం దారుణమన్నారు. నియోజకవర్గ ప్రజలను పట్టించుకోని మంత్రి రాజకీయాలకు పనికిరారన్నారు. ఎంజీఎం వె%ద్యులపై నమ్మకం లేదన్నారు. ప్రభుత్వానికి భయపడి అనుకూలంగానే రిపోర్టులు ఇస్తారని ఆరోపించారు. గాయాలు మానుతున్న క్రమంలో వె%ద్యులు పరిశీలిస్తే ఇన్ని రోజులు అనుభవించిన నొప్పి ఎలా తెలుస్తుందన్నారు. నేరెళ్ల ఘటన జాతీయస్థాయికి తీసుకెళ్లి రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలు, రాజరిక పాలనపై రాష్ట్రపతికి, కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేస్తామన్నారు. బడుగు, బలహీన వర్గాల కోసం మరో ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే సామాజిక న్యాయం వస్తుందనుకుంటే దొరల పాలన వచ్చిందన్నారు. ఆయన వెంట స్థానిక ప్రజాసంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

విక్రమ్‌గౌడ్ కేసులో నిందితుల విచారణ

ఫిలింనగర్: మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ కుమారుడు విక్రమ్‌గౌడ్ కాల్పుల కేసులో పోలీసుల కస్టడీలో ఉన్న ఐదుగురు నిందితులను బంజారాహిల్స్ పోలీసులు విచారించారు. నాంపల్లి కోర్టు వీరిని మూడు రోజుల పోలీసు కస్టడీకి ఇచ్చిన విషయం విధితమే. దీంతో రెండో రోజైన గురువారం వారిని ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్ విచారించి తమ అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కాల్పుల కేసులో పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్న మిగితా నిందితుల వివరాలనూ పోలీసులు రాబట్టినట్లు తెలిసింది. కాల్చగా మిగిలిన పదిహేడు తుటాలు పరారీలో ఉన్న నిందితుల వద్ద ఉన్నాయా అనే విషయమై ఆరా తీశారు. శుక్రవారం కూడా విచారణ కొనసాగనుంది.

అమెరికా వేదికగా టీ-20 ప్రపంచకప్ పోటీలు!

దిల్లీ: 2018 నవంబరులో మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీ జరగనుంది. అమెరికా-వెస్టిండీస్ సంయుక్తంగా మహిళల టీ20 ప్రపంచకప్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ఐసీసీ నిర్వాహకులు తాజాగా వెల్లడించారు.

ఈ సందర్భంగా ఇరు దేశాలకు చెందిన ఐసీసీ ప్రతినిధులు ఫరా గోర్సి, జానీ గ్రేవ్ మాట్లాడుతూ.. టోర్నీలో భాగంగా వీలైనన్ని ఎక్కువ మ్యాచ్‌లను ఫ్లోరిడాలోని లాడెర్‌హిల్ మైదానంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ మైదానంలో గతంలో కరేబియన్ ప్రీమియర్ లీగ్ నిర్వహించారు. 2016లో భారత్-వెస్టిండీస్ మ్యాచ్‌తో పాటు ఎన్నో అంతర్జాతీయ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చినట్లు వారు చెప్పారు. అమెరికాలో ఎంతో మంది మహిళా క్రికెటర్లు ఉన్నారు. యూఎస్ఏ పేరుతో జట్టు కూడా ఉంది. అయినప్పటికీ అమెరికాలో క్రికెట్‌ను అభివృద్ధి చేయాల్సి ఉంది. ఈ క్రమంలోనే మేము వెస్టిండీస్‌తో కలిసి మహిళల టీ20 ప్రపంచకప్ నిర్వహించాలని భావించి, జూన్‌లోనే ఐసీసీని సంప్రదింపులు జరిపాం అని ఫరా తెలిపారు.

తొలిత్రైమాసికంలో ఎస్బీఐ మూడింతల వృద్ధి

దిల్లీ: దేశీయ అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) తొలి త్రైమాసికంలో అంచనాలను మించి రాణించింది. గతేడాదితో పోలిస్తే.. మూడింతల వృద్ధిని నమోదు చేసింది. జూన్ త్రైమాసికంలో బ్యాంకు నికర లాభం రూ. 3,105.35కోట్లకు పెరిగింది. గతేడాది ఇదే సమయంలో బ్యాంకు నికర లాభం రూ. 867.32కోట్లుగా ఉంది. ఇక 2016-17 తొలి త్రైమాసికంలో బ్యాంకు ఆదాయం రూ. 69,414.82కోట్లు ఉండగా.. ప్రస్తుత ఏడాది జూన్ త్రైమాసికంలో ఆదాయం రూ. 70,776.56కోట్లకు పెరిగింది.

కాగా.. 2016-17 చివరి త్రైమాసికంలో స్థూల నిరర్థక ఆస్తులు 6.9శాతం ఉండగా.. ఈ ఏడాది జూన్ త్రైమాసికంలో అవి 9.97శాతానికి పెరిగాయి.

జావెలిన్ త్రోయర్ దావీందర్ సింగ్ సంచలనం

ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్‌కి అర్హత

లండన్: ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన జావెలిన్ త్రోయర్ దావీందర్ సింగ్ కంగ్ ఫైనల్స్‌కి అర్హత సాధించి సంచలనం సృష్టించాడు. భారత్‌కు చెందిన జావెలిన్ త్రోయర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్స్‌కి అర్హత సాధించడం ఇదే మొదటిసారి.

స్థానిక కాలమానం ప్రకారం పోటీల్లో దావీందర్ సింగ్ జావెలిన్‌ను 83మీటర్లు విసరడంతో ఫైనల్‌కి అర్హత సాధించాడు. భుజం గాయంతో బాధపడుతున్న దావీందర్ గ్రూప్-బి నుంచి పోటీలో పాల్గొన్నాడు. తొలి రెండు ప్రయత్నాల్లో 82.22మీటర్లు, 82.14మీటర్లు విసిరి విఫలమైన అతడు మూడో ప్రయత్నంలో నిర్దేశించిన 83మీటర్లను దాటడంతో అతను ఫైనల్‌కి దూసుకెళ్లాడు. శుక్రవారం ఫైనల్ పోటీలు జరగనున్నాయి. గ్రూప్-ఎ నుంచి ఐదుగురు, గ్రూప్-బి నుంచి ఏడుగురు ఫైనల్‌కి అర్హత సాధించారు. ఇదే ఈవెంట్‌లో భారత్‌కు చెందిన మరో అథ్లెట్ నీరజ్ చోప్రా ఫైనల్‌కి అర్హత సాధించలేకపోయాడు. ఈ సందర్భంగా దావీందర్ సింగ్ మాట్లాడుతూ.. నేను బరిలో దిగే సమయానికి నీరజ్ ఫైనల్‌కి అర్హత సాధించలేదని తెలిసింది. ఎలాగైనా ఫైనల్‌కి అర్హత సాధించాలని అప్పుడే నిర్ణయించు కున్నాను. దేశానికి ఏదైనా చేయాలి. గతంలో ఏ భారతీయుడు అందుకోలేని ఘనత ఇప్పుడు నేను అందుకున్నాను. ఇదంతా దేవుడి దయ. ఈ ఏడాది మేలో ఇండియన్ గ్రాండ్ ప్రిక్స్ పోటీలు జరిగే సమయంలో కుడి భుజానికి గాయమైంది. ఇప్పుడు పూర్తిగా కోలుకున్నాను. ఫైనల్‌లో మెరుగైన ప్రదర్శన చేసి దేశానికి పతకం అందిస్తాను అని దావీందర్ సింగ్ తెలిపాడు.

నేత్ర పర్వంగా కుంకుమార్చన

భక్త జనసందోహంగా మారిన మడికొండ

మడికొండ: బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా వరంగల్ అర్బన్ జిల్లా మడికొండ పంచాయతీ ఆవరణలో సామూహిక కుంకుమార్చనను నిర్వహించారు. ఉదయం 8.30గంటలకు ప్రారంభమైన కుంకుమార్చన మధ్యాహ్నం 3.30గంటలపాటు నిర్విరామంగా సాగింది. దేశ గురువు విజయభాస్కర్‌రెడ్డి నేతృత్వంలో 15 మంది వేద పండితులు పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఎనిమిది గంటలపాటు సాగిన పూజలతో స్థానికంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మడికొండ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఎస్సై మధుప్రసాద్‌తోపాటు బొడ్రాయి ఉత్సవ వలంటర్లు, స్వచ్ఛంద సంస్థలు వేడుకల్లో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. అనంతరం దేవతలను అవాహనం చేస్తూ మహాలక్ష్మి, భూలక్ష్మి, బొడ్రాయిలకు పూజలు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ వేడుకలో చివరి ఘట్టం బొడ్రాయి ప్రతిష్ఠకు ధాన్యాధివాసం, జలాధివాసం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాలను రాష్ట్ర బ్రాహ్మణ అర్చక సమాఖ్య నాయకుడు జగన్మోహన్‌శర్మ సందర్శించి ధార్మికోపన్యాసం చేశారు. ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు కార్పొరేటర్లు జోరిక రమేశ్, తొట్ల రాజుయాదవ్, లింగం మౌనికరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

85 ఏళ్ల రికార్డుపై

విరాట్ సేన గురి!

న్యూఢిల్లీ: ఇప్పటికే శ్రీలంకతో టెస్టు సిరీస్‌ను గెలిచి మంచి ఊపు మీద ఉన్న భారత క్రికెట్ జట్టు సరికొత్త రికార్డుపై దృష్టి సారించింది. మూడు టెస్టుల సిరీస్ ను వైట్ వాష్ చేసి అరుదైన ఘనతను సొంతం చేసుకునేందుకు వ్యూహాలు రచిస్తోంది. చివరిదైన మూడో టెస్టును భారత జట్టు గెలిచిన పక్షంలో.. విదేశాల్లో మూడు టెస్టుల సిరీస్ ను క్లీన్‌స్వీప్ చేసిన తొలి భారత క్రికెట్ జట్టుగా విరాట్ సేన నిలుస్తోంది. భారత జట్టు తన 85 ఏళ్ల టెస్టు ప్రయాణంలో విదేశాల్లో మూడు టెస్టుల సిరీస్ ను క్లీన్ స్వీప్ చేసిన దాఖలాలు లేవు. ఆ రికార్డును విరాట్ సేన తన ఖాతాలో వేసుకోవాలని భావిస్తోంది. ప్రస్తుతం ఆ ఘనతను సాధించేందుకు భారత జట్టు కసరత్తులు చేస్తోంది. నేడు ఉదయం గం.10.00ని.లకు పల్లెకెలె ఇంటర్నేషనల్ స్టేడియంలో భారత్ -శ్రీలంక జట్ల మధ్య మూడో టెస్టు మ్యాచ్ ఆరంభం కానుంది. ఇదిలా ఉంచితే, గత రెండు టెస్టు మ్యాచ్ ల్లో భారత జట్టు ఘన విజయాలు సాధించిన సంగతి తెలిసిందే. గాలేలో జరిగిన తొలి టెస్టులో భారత జట్టు 304 పరుగుల తేడాతో విజయం సాధించగా, కొలంబోలో జరిగిన రెండో టెస్టులో ఇన్నింగ్స్ 53 పరుగుల తేడాతో భారీ విజయాన్ని భారత్ సొంతం చేసుకుంది. తద్వారా మూడు టెస్టుల సిరీస్ ను ఇంకా మ్యాచ్ ఉండగానే 2-1తో గెలిచింది.

బహిరంగ మలవిసర్జన నిర్మూలన జిల్లాగా పెద్దపల్లి

అక్టోబర్ 2న ప్రకటన

ముత్తారం: ఈ ఏడాది అక్టోబరు 2 వరకు బహిరంగ మలవిసర్జన నిర్మూలన జిల్లాగా పెద్దపల్లిని చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర స్వచ్ఛ భారత్ మిషన్, యునిసెఫ్ సమన్వయకర్త శరత్‌బాబు తెలిపారు. ముత్తారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశమైన అనంతరం ముత్తారంలో నిర్మించిన మరుగుదొడ్లను పరిశీలించి వాటి ఉపయోగం గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ దేశంలో బహిరంగ మలవిసర్జన నిర్మూలనగా 679 జిల్లాలను ప్రకటించినట్లు తెలిపారు. వచ్చే గాంధీ జయంతి అక్టోబరు 2 నాటికి మరో 300 జిల్లాలను ప్రకటించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లో ఇప్పటికే లక్ష్యం పూర్తయినట్లు పేర్కొన్నారు. 19న జరిగే సమన్వయ సదస్సుకు రాష్ట్రస్థాయి అధికారులు హాజరవుతారన్నారు. పెద్దపల్లి జిల్లాలో గుర్తించిన ఓడీఎఫ్ ఐదు మండలాల్లో 10,590 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఎంపీడీవో విజయ్‌కుమార్, జిల్లా స్వచ్ఛభారత్ మిషన్ సమన్వయకర్త రాఘవులు, ముత్తారం సర్పంచి తాటిపాముల వకుళారాణి శంకర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మాధురి, ఉపాధిహామీ ఏపీవో దమయంతి పాల్గొన్నారు.

VIJAYABHANU - Hyderabad

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from ANH Apartments, Block-A, Flat No. 508, Bazar Ghat, Red Hills, Hyderabad-500 004. and printed at **VIJAYABHANU PRESS**, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003. R.N.I. No. 37754/81. Postal Regd. No. H-HD-1017/2006-08, Phone : 040 23370933, Fax : 040 66770933, Cell: 9701529570 ✯ e-mail: vijayabhanudaily@gmail.com